www.prajajwalanews.com

# ప్రజాజ్వాల

తెలుగు దినపత్రిక

ప్రజాజ్వాల
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును
చీఫ్ ఎడిటర్ మాదగాని సుగ్రీవుడు, 9441284503

ఆదివారం | 2-11-2025 | సంపుటి: 15 | సంచిక: 133 | పేజీలు : 8 | వెల : 4/- | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



## కేటీఆర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం
- ఎన్నికల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్
- ప్రజలతో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు వెల్లడించిన మంత్రి
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం

2లో

## నిర్బంధాన్ని ఒప్పుకోం

- ఆసియా పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛా నౌకాయానం ఉండాలి
- ప్రాంతీయ భద్రతకు ఈ ప్రాంత దేశాలన్నీ కలిసి పని చేయాలి
- ఏషియాన్ రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్‌సింగ్



# ఒక్క అవకాశం ఇవ్వండి...
# అభివృద్ధి చేసి చూపిస్తాం

- ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు పెద్దపీట: సీఎం రేవంత్
- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశాం
- ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం
- జూబ్లీహిల్స్ రోడ్ షో కార్నర్ మీటింగ్‌లలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు పెద్దపీట వేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో రోడ్ షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లలో ప్రజలనుద్దేశంచి ఆయన ప్రసంగించారు. 2014లో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఐదేళ్లు మహిళా మంత్రి లేదని.. తాము అధికారంలోకి రాగానే సీతక్క, కొండా సురేఖలకు మంత్రి పదవులు ఇచ్చామని గుర్తుచేశారు. శిల్పారామం దగ్గర మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం స్టాల్స్ ఇచ్చామన్నారు. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే దాన్ని రద్దు చేయాలని మాట్లాడటం బీఆర్‌ఎస్ బద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి బయటకు పంపిన కేటీఆర్.. జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తున్న ఆ పార్టీ అభ్యర్థి సునీతమ్మను మంచిగా

(మిగతా 2వ పేజీలో)

## నక్సలిజం త్వరలోనే అంతం

- మావోయిస్టుల సిద్ధాంతంతో అధోగతే
- వారు లొంగిపోతుండటం శుభపరిణామం
- రాజ్యాంగాన్ని స్వీకరించి, శాంతి మార్గంలో నడుస్తుండటం హర్షణీయం
- ఛత్తీస్‌గఢ్ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- రాష్ట్ర అసెంబ్లీ నూతన భవనం ప్రారంభం





## అభివృద్ధి కావాలా? అరాచకం కావాలా?

- బిహార్ ప్రజలే తేల్చుకోవాలి
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పిలుపు

గోపాల్‌గంజ్: మోదీ-నితీశ్ కుమార్‌ల అభివృద్ధి అజెండా కావాలో లేక రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) జంగిల్‌రాజ్ కావాలో తేల్చుకోవాలని బిహార్ ప్రజలకు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా



## ఇప్పుడు నాకు ఎలాంటి బంధనాలు లేవు..
# నేను ఫ్రీ బర్డ్‌ని

- కరీంనగర్‌లో జాగృతి జనం బాట పాదయాత్రకు ప్రజల విశేష స్పందన
- రైతులు, విద్య, వైద్యం, మైనారిటీల సమస్యలపై ప్రభుత్వాన్ని ఆక్షేపించిన కవిత
- పర్యావరణ పరిరక్షణ, సామాజిక తెలంగాణ కోసం జాగృతి కట్టుబడి ఉందని హామీ

2లో

# ఓటమి భయంతోనే సీఎం ధమ్కీలు: కేటీఆర్

- 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?.. నిరుద్యోగ భృతి ఏమైంది?
- సెటిల్‌మెంట్లు చేసుకునే బ్లాక్‌మెయిలర్ సెంటిమెంట్ గురించి మాట్లాడితే ఎలా?..
- సీఎం రేవంత్‌ది కాంగ్రెస్‌తో ఫేక్ బంధం, బీజేపీతో పేగు బంధం
- రహ్మత్‌నగర్ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏటా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలిచ్చిందో చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. మరో ఎన్నికల హామీ అయిన నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి రహ్మత్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన భారీ రోడ్‌షోలో కేటీఆర్ మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిరాశతో సీఎం నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేయకుంటే అన్నీ రద్దుచేస్తామని ధమ్కీ ఇస్తున్నారని విమర్శించారు. ఎగిరెగిరి పడితే జూబ్లీహిల్స్ ప్రజలు పెట్టే వాతలకు ప్రభుత్వమే పతనమయ్యే రోజు వస్తుందని హెచ్చరించారు. ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని రేవంత్‌రెడ్డి ప్లాన్ వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 500 రోజుల్లో తిరిగి కేసీఆర్ సీఎం కాబోతున్నారని

(మిగతా 2వ పేజీలో)



# నిర్బంధాన్ని ఒప్పుకోం

న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ సముద్ర ప్రాంతంలో స్వేచ్ఛాయుత, సమ్మిళిత నౌకాయానం ఉండాలని భారత్ కోరుకుంటోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ఎలాంటి నిర్బంధ విధానాలు సహించేది లేదని స్పష్టంచేశారు. కౌలాలంపూర్‌లో శనివారం ఆయన ఏషియాన్ డిఫెన్స్ మినిస్టర్స్ మీటింగ్ ప్లస్ (ఏడీఎంఎం%-%ప్లస్) కాంక్లేవ్‌లో ఆయన ప్రసంగించారు. 'చట్టంపట్ల భారత్ తన విశ్వాసాన్ని, నమ్మకాన్ని పునరుద్ఘాటిస్తోంది. ముఖ్యంగా యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ సీస్ (యూఎన్‌సీఎల్‌ఓఎస్)పై భారత్‌కు పూర్తి నమ్మకం ఉంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత నౌకాయానం ఉండాలన్న భారత ఆకాంక్ష ఏ దేశానికీ వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదు. ఈ ప్రాంత దేశాల ఉమ్మడి భద్రత, ప్రయోజనాల కోసమే మేం ఈ విధానం అవలంభిస్తున్నాం. ఈ ప్రాంతం ఎలాంటి నిర్బంధాలు, బలప్రయోగాలు లేకుండా స్వేచ్ఛాయుతంగా ఉండాలి. భవిష్యత్తులో భద్రత అనేది కేవలం సైనిక సామర్థ్యంపై ఆధారపడి ఉండదు. వనరులు పంచుకోవటంపై, డిజిటల్, భౌతిక మౌలిక వసతులపై, మానవతా సంక్షోభాలను కలిసికట్టుగా ఎదుర్కోవటంపై ఆధారపడి ఉంటుంది'అని పేర్కొన్నారు.

# అభివృద్ధి కావాలా? అరాచకం కావాలా?

స్పష్టంచేశారు. అభివృద్ధి పట్టం కట్టాలా? లేక ఆటవిక రాజ్యం కావాలా? అనేది మన చేతుల్లోనే ఉందన్నారు. శనివారం బిహార్‌లో గోపాల్‌గంజ్, సమస్తీపూర్, వైశాలి జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా వర్చువల్‌గా ప్రసంగించారు.వాతవరణం అనుకూలించకపోవడంతో ఆయా ప్రాంతాలకు ఆయన చేరుకోలేకపోయారు. బిహార్ అభివృద్ధి బాధ్యతను ఎవరికి అప్పగించాలో నిర్ణయించడానికి ఈ ఎన్నికలు ఒక సువర్ణావకాశమని అమిత్ షా చెప్పారు. గతంలో ఆర్జేడీ పాలనలో ఎన్నో అకృత్యాలు జరిగాయని వెల్లడించారు. అప్పట్లో నక్సలైట్లు పెట్రేగిపోయారని, రక్తం ఏరులై పారిందని అన్నారు. భూస్వాముల ప్రైవేట్ సైన్యాలు ప్రజలపై పెత్తనం చెలాయించాయని గుర్తుచేశారు. ఆనాటి రాక్షస రాజ్యం మళ్లీ రావొద్దంటే ఆర్జేడీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఇప్పుడు నాకు ఎలాంటి బంధనాలు లేవు.. నేను ఫ్రీ బర్డ్‌ని

కరీంనగర్ జిల్లా పరిధిలో జాగృతి అధ్యక్షురాలు కవిత చేపట్టిన జాగృతి జనం బాట పాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తోందని పేర్కొన్నారు. "సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం అన్ని వర్గాల వారినీ కలుపుకొని ముందుకు సాగుతున్నాం. విద్య, వైద్యం వంటి కీలక అంశాలు ఇంకా జనాల మధ్య లోతుగా చేరాల్సి ఉంది," అని కవిత తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడడంలో మాజీ సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేసిన ఆమె, ఆర్టీసీ విభాగంలో ఉన్న సమస్యలపై విప్లవాత్మక ఆలోచన అవసరమని సూచించారు. "సామాజిక తెలంగాణను సాకారం చేయడం మనందరి బాధ్యత," అని అన్నారు.

# కేటీఆర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేడి రోజురోజుకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. పది సంవత్సరాల పాలనలో అక్రమంగా సంపాదించిన అహంతో, ఓటర్లను కొనుగోలు చేసే ప్రయత్నం చేయడం తగదని ఆయన విమర్శించారు. "ఓటుకి 5 వేల రూపాయలు అడుక్కోండి అని చెప్పడం అక్షేపణీయం" అని వ్యాఖ్యానించిన ఆయన, ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకుని కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ%ొ% "హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఓటుకు ఆరు వేలు ఇచ్చిన సంస్కృతి కేటీఆర్‌దే. ఇప్పుడు అదే పద్ధతిలో జూబ్లీహిల్స్‌లో ప్రయత్నిస్తున్నారు. కానీ జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచన కలిగినవారు. వారు డబ్బు రాజకీయాలకు లోనుకావు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిరిగానే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తారు" అని విశ్వాసం వ్యక్తం చేశారు. "మా ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వంగా పనిచేస్తోంది. ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే పథకాలు అమలు చేస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, కొత్త ఉద్యోగాల కల్పన.. ఇవన్నీ మా నిబద్ధతను ప్రతిబింబిస్తాయి," అని తెలిపారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేసి చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)



చూసుకుంటాడా అని ప్రశ్నించారు. ఇవన్నీ కేటీఆర్ చెల్లెలే బయటకు వచ్చి చెబుతోందన్నారు. సొంత చెల్లికి అన్నం పెట్టని వారు పిన్నమ్మ కూతురికి బంగారు గాజులు పెడతానంటే ప్రజలు నమ్ముతారా? అని ఎద్దేవా చేశారు. ఉపఎన్నికలో సెంటిమెంట్ రాజేయాలని బీఆర్ఎస్ చూస్తోందని.. పదేళ్లు అధికారంలో ఉన్నా, అదే పార్టీకి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా పనిచేసినా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో ప్రజలు ఆలోచించాలన్నారు. ఇప్పుడు తాడు బొంగరం లేకుండా అభివృద్ధి చేస్తామని ఓట్లు దండుకోవడానికి ఆ పార్టీ నేతలు ముందుకొస్తున్నారని దుయ్యబట్టారు. మాయమాటలు చెప్పే వాళ్లకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ పనిచేసిందని.. అందుకు ప్రతిగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రంలో ప్రతి సందర్భంలో మోదీ సర్కారుకు కేసీఆర్ మద్దతు పలికారని గుర్తుచేశారు. రాష్ట్రానికి నయా పైసా నిధులు తేలేని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కొత్తగా సమస్యలు ఉన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి.. దాని పరిధిలోకి వచ్చే జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలోని బోరబండకు వచ్చి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదని సీఎం నిలదీశారు. 'బీఆర్ఎస్‌కు పదేళ్లు అవకాశం కల్పించినా అభివృద్ధి జరగలేదు. కాంగ్రెస్‌కు ఈసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి చేసి చూపిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సాధారణ ఎన్నికల్లో అజహరుద్దీన్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తామని మాట ఇచ్చామని.. ఇచ్చిన మాట ప్రకారం ఆయన్ను మంత్రి పదవి ఇచ్చామని తెలిపారు. స్థానికుడైన నవీన్ యాదవ్‌ను ఆశీర్వదిస్తే రూ. వందల కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని రేవంత్ హామీ ఇచ్చారు. అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత నవీన్ తీసుకుంటాడన్నారు. రోడ్ షో కార్నర్ మీటింగ్‌లలో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# నక్సలిజం త్వరలోనే అంతం

రాయ్‌పూర్: దేశంలో నక్సలిజం పూర్తిగా అంతమయ్యే రోజు ఇక ఎంతో దూరంలో లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మావోయిస్టుల ప్రభావం ఇప్పటికే చాలావరకు తగ్గిపోయిందని చెప్పారు. ఆయన శనివారం ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారు. రూ.14,260 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్ అవతరించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో నవ రాయ్‌పూర్‌లో నిర్వహించిన 'రజత్ మహోత్సవ్'లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రగతి ప్రయాణం తనకు ఆనందం కలిగిస్తోందని అన్నారు. 25 ఏళ్ల క్రితం నాటిన విత్తనం ఇప్పుడు వటవృక్షంగా మారిందని ఉద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ 25 ఏళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఒకప్పుడు నక్సలైట్ల హింసాకాండకు, వెనుకబాటుతనానికి ప్రతీక అయిన రాష్ట్రం నేడు అభివృద్ధి, భద్రత, స్థిరత్వానికి మారుపేరుగా మారిందని హర్షం వ్యక్తంచేశారు. నక్సల్స్ హింసాకాండ నుంచి రాష్ట్రం విముక్తి పొందడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. మావోయిస్టుల సిద్ధాంతం వల్ల అధోగతే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోతుండడం శుభపరిణామం అని అభివర్ణించారు. వారు భారత రాజ్యాంగం స్వీకరించి, శాంతి మార్గంలో నడుస్తున్నారని పేర్కొన్నారు. శాసనసభ అంటే కేవలం చట్టాలు చేసే వేదిక కాదని.. రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దే మహోన్నత క్షేత్రమని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని నవ రాయ్‌పూర్ అటల్ నగర్‌లో రాష్ట్ర అసెంబ్లీ నూతన భవనాన్ని ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అసెంబ్లీ ప్రాంగణంలోనే ఉన్న దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని కూడా నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 16వ శతాబ్దంలో తులసీదాస్ రచించిన రామచరిత మానస్‌లోని ఓ శ్లోకాన్ని ప్రధాని మోదీ పఠించారు. సుపరిపాలనకు శ్రీరాముడి ఆశయాలే నాంది అని తెలిపారు. 'అభివృద్ధి చెందిన భారత్' అనే దార్శనికతకు ఆయనే స్ఫూర్తి అని పేర్కొన్నారు. శ్రీరాముడి తల్లి జన్మస్థలం ఛత్తీస్‌గఢ్‌లోనే ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు రాముడు ప్రియమైన మేనల్లుడు అని వ్యాఖ్యానించారు.

# మజ్లిస్ ముందు మోకరిల్లుతున్నాయ్

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం**

**డబుల్ బెడ్రూం, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేదలను దగా చేశాయి**

**హామీలు అమలు చేయాలంటూ కాంగ్రెస్ నేతల్ని నిలదీయాలని ప్రజలకు పిలుపు.. జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారం**

హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మజ్లిస్‌కు మోకరిల్లుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారంలో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఇప్పుడు మజ్లిస్ కనుసన్నల్లో ఉందని.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు మజ్లిస్ ఓటు బ్యాంకే ముఖ్యంగా మారిందని దుయ్యబట్టారు. ఈ పరిస్థితుల నుంచి జూబ్లీహిల్స్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కేవలం ఒక్క నియోజకవర్గానికే పరిమితమైంది కాదని.. మొత్తం రాష్ట్రాన్ని ప్రభావితం చేసేలా కీలకంగా మారిందని చెప్పారు. మజ్లిస్ సానుభూతిపరుల ఓట్ల కోసమే సోనియా, రాహుల్‌గాంధీలు అజహరుద్దీన్‌ను మంత్రి పదవి కట్టబెట్టారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ అవకాశవాద రాజకీయాలపై కార్పెట్ బాంబింగ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట, రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల పేరిట పేదలను దగా చేస్తున్నాయని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ వాటి అమలులో మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. రూ. 4 వేల నిరుద్యోగ భృతి, మహిళలకు రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యా భరోసా కార్డులు, వివాహమైతే తులం బంగారం వంటి పథకాలను అమలు చేయాలంటూ ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని ప్రజలకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని.. బంగారు తెలంగాణ అని చెప్పి కేసీఆర్ సొంత కుటుంబాన్నే బంగారం చేసుకున్నారని విమర్శించారు. డబుల్ బెడ్రూం పథకం కేవలం ప్రచారానికి వాడుకొని కేసీఆర్ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలకు ఏం చేశాయని పార్టీలకు ప్రజలు ఓటు వేయాలని కిషన్‌రెడ్డి నిలదీశారు.



**పాకిస్తాన్ అంటే వాళ్లకు ప్రేమ**

శత్రు దేశమైన పాకిస్తాన్‌పై కాంగ్రెస్ పార్టీ గురు, శిష్యులకు ప్రేమ ఎక్కువని కిషన్‌రెడ్డి ఆరోపించారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌ను చులకన చేసి భారతీయ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. పాక్‌కు మద్దతుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న బీజేపీకి ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థి దీపక్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు.

# దేవుడా.. మరో ఘోరం

శ్రీకాకుళం: మొన్న తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు.. నిన్న సింహాచలంలో గోడ కూలి ఏడుగురు.. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కార్తీక ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుపోవడమే ఘటనకు ప్రధాన కారణం అని స్పష్టమువుతోంది. ఉత్తరాంధ్ర చిన్న తిరుపతిగా పేరుగాంచిన ఈ ఆలయానికి కార్తీక ఏకాదశి రోజున వేలాదిగా భక్తులు వస్తారని తెలిసి కూడా బందోబస్తు ఇవ్వలేదు. ఆలయంలో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మెట్లెక్కి పై అంతస్తుకు వెళ్తే అక్కడ వేంకటేశ్వరస్వామి దర్శనమిస్తారు. ఈ క్రమంలో దర్శనానికి వెళ్లే వారు.. దర్శనం చేసుకుని బయటకు వచ్చే వాళ్లతో ప్రవేశ మార్గం (రాకపోకలకు ఒకే మెట్ల మార్గం) కిక్కిరిసింది. భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు లేకపోవడంతో ఉదయం 11.45 గంటల సమయంలో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. దీంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోయారు. తీవ్ర గందరగోళం ఏర్పడింది. కేకలు.. ఆర్తనాదాలు.. ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి.. ప్రాణ భయంతో మిగితా వారు కింద పడిన వారిని తొక్కుకుంటూ బయటకు వెళ్లడానికి దూసుకొచ్చారు. ఈ క్రమంలో భక్తుల ఒత్తిడి కారణంగా కుడి వైపు రెయిలింగ్ ఒరిగిపోయింది. దీంతో క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. దీంతో కింద పడిపోయిన వారిలో ఊపిరి ఆడక తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ 20 మందిని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. మరికొంత మంది మెట్లపై నుంచి కిందకు దూకి గాయపడ్డారు. కింద పడిపోయిన తర్వాత వృద్ధులు, పిల్లలు లేచేందుకు ఎంత ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదని.. 'అమ్మా.. అయ్యా.. ఊపిరి అందడం లేదు.. మీకు దండం పెడతా.. చచ్చిపోతున్నా.. ఎవరైనా కాపాడాలంటూ..' ప్రాధేయపడి అడుగుతున్నా ఎవరూ వినిపించుకునే పరిస్థితే లేకపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఆలయానికి కొంత కాలంగా ప్రతి శనివారం వేలాది మంది భక్తులు వస్తారనే విషయం అందరికీ తెలుసు. పైగా శనివారం కార్తీక ఏకాదశి. ఈ దృష్ట్యా భక్తులు మరింతగా తరలి వస్తారని ఎవరూ ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. మామూలుగా పర్వదినాల్లో, కార్తీక మాసంలో ఆలయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకునేలా దిశా నిర్దేశం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ విషయంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పడానికి ఈ ఘోర ఘటనే ప్రత్యక్ష నిదర్శనం. కాశీబుగ్గ ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చినా పోలీసుల పర్యవేక్షణ కొరవడింది. పైన ఉన్న ఆలయంలో మామూలుగా 2000 మంది భక్తులు ఉండటానికి అవకాశం ఉంటుంది. అయితే ఘటన జరిగే సమయానికి అంతకు రెండు మూడు రెట్లలో భక్తులు ఉన్నారు. వారంతా ఒక్కసారిగా కిందకు రావడానికి ప్రయత్నించడంతో మెట్లపై తోపులాట చోటు చేసుకుంది. వారు



కిందకు రాకుండా నియంత్రించి ఉంటే ఇంతగా ప్రాణ నష్టం జరిగి ఉండేది కాదని, ఇలా జరగడానికి కారణం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని భక్తులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మాజీ మంత్రి సీదిరి పలువురికి సీపీఆర్ చేశారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించడానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష సంఘటనా స్థలానికి చేరుకోగా, కొంత సమయం తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు వచ్చారు. అనంతరం మృతదేహాలను తరలించే చర్యలు చేపట్టారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తదితరులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి పోలీస్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పోలీసులు ఆలయం, ఆస్పత్రితో పాటు పరిసర ప్రాంతాలను ఆధీనంలోకి తీసుకున్నారు. మృతదేహాల వద్ద కుటుంబ సభ్యుల రోదనలు, క్షతగాత్రుల కేకలతో ఆస్పత్రి దద్దరిల్లింది. డీఐజీ గోపినాథ్ జెట్టి ఆస్పత్రి వద్దకు చేరుకుని పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తదితరులు ఆస్పత్రిలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మంత్రి లోకేశ్ వచ్చారు. బాధిత కుటుంబాలను పరామర్శించి మీడియాతో మాట్లాడారు. అంతకు ముందు మృతులు, క్షతగాత్రుల బంధువులు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీషను నిలదీశారు.

# బిహారీనని చెప్పుకోవడం గర్వకారణం

**బిహార్ సీఎం నితీశ్ కుమార్ స్పష్టీకరణ**

**తమకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి**



పాట్నా: బిహారీగా ఉండడం, బిహారీనని చెప్పుకోవడం ఇప్పుడు గర్వకారణమని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ అన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ మేరకు నితీశ్ కుమార్ శనివారం సోషల్ మీడియాలో ఒక వీడియో సందేశం విడుదల చేశారు. తాను అధికారంలో ఉన్నప్పటికీ తన కుటుంబం కోసం ఏమీ చేయలేదని, ఎల్లప్పుడూ రాష్ట్ర అభివృద్ధి కోసమే కృషి చేశానని తెలిపారు. బిహార్ ప్రగతే ధ్యేయమని స్పష్టంచేశారు. 2005 నవంబర్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తమ పాలనలో శాంతి భద్రతలు చాలావరకు మెరుగుపడ్డాయని వివరించారు. చట్టబద్ధ పాలన తీసుకొచ్చామని, ప్రజలు ఇప్పుడు తాము బిహారీలమని గర్వంగా చెప్పుకోగలుగుతున్నారని ఉద్ఘాటించారు. మహిళలు, హిందువులు, ఉన్నత కులాలు, దళితులు, వెనుకబడిన తరగతులు.. ఇలా సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడించారు. ఆర్జేడీకి అధికారం అప్పగిస్తే అరాచయ పాలన వస్తుందని నితీశ్ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. తమకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'వికసిత్ బిహార్' తమ ధ్యేయమని అన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా మారుస్తామని హామీ ఇచ్చారు. బిహార్‌లో ఈ నెల 6, 11న అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ నెల 14న ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు.

# సంపాదకీయం

## మురికితనం కరుకుతనం పాలైన మేధ

తొలి ప్రేమ నవ యవ్వన కాలాన్ని దాటదు. తరుణప్రాయంలో అంకురించిన మేధా ఆసక్తులు తాత్కాలికమైనవి కాక జీవితపర్యంతం వర్ధిల్లడం కద్దు. అటవీ సామాజికుల చరిత్రకారునిగా నేను నా విద్వత్ వృత్తి జీవితానికి శ్రీకారం చుట్టాను. బ్రిటిష్ వలసపాలనలో మొరటుగా ధ్వంసమైన జీవితాలు వారివి. క్రమంగా నా ఆసక్తులు, పరిశోధనలు, రచనా వ్యాసంగాలు విభిన్న అంశాల వైపుగా వికసించాయి. అయినప్పటికీ నేను తొట్టతొలుత సాగుచేసిన మేధా క్షేత్రంతో నా అనుబంధాన్ని కొనసాగిస్తూ వస్తూన్నాను. నిజానికి గత వారం రోజులూ ఒక యువ పరిశోధకుడి డాక్టొరల్ థీసిస్ చదువుతూ గడిపాను. ఇప్పుడు జార?ండ్ రాష్ట్రంగా విలసిల్లుతున్న ప్రాంతాల సామాజిక, పర్యావరణ చరిత్రను శోధించిన సిద్ధాంత వ్యాసమది. అది నన్ను బాగా ప్రభావితం చేసింది. ఎంతగా అంటే ఈ కాలమ్‌లో దాని గురించి రాసి తీరాలనే బలీయమైన ప్రేరణను నాలో పాదుకొల్పింది. బ్రిటిష్ పాలనలో సింగ్‌భూమ్ ప్రాంతంలోని ఆదివాసీ సమాజంలో సంభవించిన పరివర్తనల పూర్వాపరాలను ఆ థీసిస్ విశ్లేషించింది. ఈస్టిండియా కంపెనీ క్రమంగా ఆ ప్రాంతంపై సైనిక, పాలనాపరమైన నియంత్రణను సాధించిన వైనాన్ని తొలుత వివరించింది. ఆ తరువాత ఆ ప్రాంత ప్రాకృతిక ఆవరణాన్ని, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను వలసపాలన ఎలా పునర్వ్యవస్థీకరించిందో పేర్కొంది. వలసపాలకుల అటవీ విధానం వ్యాపార ప్రయోజనాలకు ఇచ్చిన ఎనలేని ప్రాధాన్యం, కొత్త పాలకులతో సంప్రతింపుల బాధ్యతలు నిర్వర్తించే గ్రామ పెద్ద హోదాలో చోటు చేసుకున్న మార్పులు, తమ జీవితాలలో వలసపాలన తెస్తున్న మార్పులపట్ల ఆదివాసుల ప్రతిస్పందనలు మొదలైన అంశాలను ఆ థీసిస్ విపులంగా స్పృశించింది. పర్యావరణం, సమాజం, రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరిస్తూ మేధా చరిత్రపై కూడా తగు శ్రద్ధ చూపిన అధ్యయనమది. సింగ్‌భూమ్ గిరిజనులపై యూరోపియన్ అధికారుల, భారతీయ మావన శాస్త్రవేత్తల మేధా కృషిని నిశితంగా విశ్లేషించింది. ఈ యువ చరిత్రకారుని పరిశోధనా కృషిలో ఆరు విశిష్ట వైదుష్య లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది జారండ్, విశాల భారత ప్రాంతాల ఆదివాసుల జీవనరీతులపై గతించిన కాలంలో విఖ్యాతులు, విస్మృతులు వెలయించిన రచనలపై సమగ్ర సాధికారతబీ రెండోది విస్తృత శ్రేణి ప్రాథమిక ఆధారాలను కనుగొని, ఉపయోగించుకున్న సమర్థత. జాతీయ, రాష్ట్ర, జిల్లా ఆర్కైవ్‌లలో లభించే సమాచారాన్ని ఈ పరిశోధకుడు కూలంకషంగా అధ్యయనం చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

అలాగే శతాధిక సంవత్సరాల క్రితం ప్రచురితమైన పుస్తకాలు, వ్యాసాలను కూడా విస్తృతంగా సంప్రతించాడుబీ మూడోది%-% పరిశోధిస్తున్న ప్రాంతంలో క్షేత్ర కృషి ద్వారా అనుబంధ జ్ఞానాన్ని సముపార్జించేందుకు సుముఖత. 'ఒక చరిత్రకారుడికి మందమైన నోట్‌బుక్‌తో పాటు మందమైన బూట్లు కూడా అవసరం' అన్న ఫ్రెంచ్ చరిత్రకారుడు మార్క్ బ్లాచ్ (1866–1944) సూక్తిని ఈ యువ విద్వజ్ఞుడు మనసా, కర్మణా పాటించాడు (గతాన్ని సమగ్రంగా, విశ్వసనీయంగా అర్థం చేసుకోవడానికి ప్రపంచంలో కఠినమైన, ఆచరణాత్మక పనిబీ శ్రద్ధాయుతమైన, కఠిన మేధో ప్రయత్నం రెండూ అవసరమని మార్క్ బ్లాచ్ ప్రవచించారు)బీ నాల్గవది-తన వాదనలకు మద్దతుగా ప్రాథమిక ఆధారాల నుంచి స్ఫుటమైన, భావస్ఫోరకమైన ఉటంకింపులపై పరిపూర్ణ శ్రద్ధ పెట్టాడుబీ ఐదవది- తన విశ్లేషణాత్మక అధ్యయనాలను స్పష్టమైన, సూటియైన, ఆకర్షణీయమైన వచనంలో రాశాడు. ఎక్కడా ప్రత్యేక పరిభాషను ఎక్కువగా ఉపయోగించలేదుబీ ఆరవది- బహుళ దృక్కోణాలను అంగీకరించే వివరణాత్మక విశ్లేషణ. వాదనల సూక్ష్మ విస్తరణ ప్రశస్తంగా ఉన్నది. వలసపాలనాయుగ అధికారులు, వర్తమాన ఆదివాసీహక్కుల కార్యకర్తలలో సాధారణంగా ద్యోతకమవుతుండే గతానుగతిక భావాలను ఈ యువ పరిశోధకుడు పునరుక్తం చేయలేదు.

నాటి వలస పాలకులకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన ఆదివాసీ తిరుగుబాట్లు, ప్రస్తుత కాలపు ఆందోళనలు, ఉద్యమాల మధ్య ఉన్న ఘటనాత్మక సామ్యాలు, సూత్రబద్ధమైన సంబంధాలపై ఆలోచనాత్మక విమర్శలు చేశాడు. తమ ప్రశాంత, సంప్రదాయబద్ధమైన జీవితాలలో ఆధునిక రాజ్య వ్యవస్థలు పురికొల్పిన అల్లకల్లోలానికి వ్యతిరేకంగా నాడు, నేడు ఆదివాసుల తిరుగుబాట్లను సుసంబంధంగా విశ్లేషించాడు. ఆసేతుహిమాచలం 500కు పైగా ఉన్న ఆదివాసీ సమూహాల జీవన రీతులలో విస్తారమైన వైవిధ్యాన్ని విస్మరించి సమస్త వనవాసీలను ఒక సజాతీయ సమాజంగా చిత్రించేందుకు గత కాలంలోనూ వర్తమానంలోనూ ప్రయత్నించిన రచనలలోని లోపాలను ఈ యువ మేధావి నిశితంగా విమర్శించాడు. **-ఎడిటర్**

## కెనడాలో భారత సంతతి పారిశ్రామికవేత్త హత్య



లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కెనడాలో ఘాతుకానికి పాల్పడింది. అక్కడ భారత సంతతి పారిశ్రామికవేత్త దర్శన్ సింగ్ సహాసి(68)ని సోమవారం హత్య చేయడంతోపాటు పంజాబీ గాయకుడు చన్ని నట్టన్ ఇంటిపై కాల్పులు జరిపింది. తాము అడిగిన డబ్బు ఇవ్వకపోవడంతోనే దర్శన్ సింగ్‌ని హత్య చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు గోల్డి ధిల్లాన్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆయన పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించాడు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో ఎబాట్స్‌ఫోర్డ్ వద్ద ఉన్న దర్శన్ సింగ్ ఇంటి వద్దే ఆయన్ను కాల్చి చంపారు. రోడ్డు మీద పార్కు చేసి ఉన్న తన కారులో ఎక్కిన దర్శన్‌సింగ్‌పై అప్పటికే అక్కడికి కారులో వచ్చి వేచిఉన్న ఆగంతకుడు కాల్పులు జరిపి పరారయ్యాడు. దర్శన్‌సింగ్ కేనమ్ ఇంటర్నేషనల్ అనే పెద్ద టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీ యజమాని. 1991లో కెనడా వెళ్లిన ఆయన తొలుత చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. తర్వాత ఒక టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీని కొనుగోలు చేసి దాన్ని గ్లోబల్ కంపెనీగా తీర్చిదిద్దారు. దాతగాను పేరొందిన ఆయన హత్యపై కెనడాలోని పంజాబీ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. కాగా, గాయకుడు సర్దార్ ఖేరాకు దగ్గరవుతున్నందుకే నట్టన్ ఇంటిపై కాల్పులు జరిపినట్లు ధిల్లాన్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నాడు.

## దళితుల ఆత్మగౌరవ ర్యాలీకి బయలుదేరి వెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడికి నిరసనగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి బాచుపల్లి మండల ఎంఆర్పిఎస్ నాయకులు బయలుదేరి వెళ్లారు . ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు రాస మల్ల యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఏసుబాబు విష్ణు నగేష్ పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## నిరుపేద విశ్వబ్రాహ్మణ స్వర్ణకార కుటుంబానికి చేయూత

### -అమ్మాయి వివాహానికి 65000 వేల ఆర్థిక సహాయం

### - రాష్ట్ర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం సభ్యులు ఔదార్యం



**పాలకుర్తి,ప్రజాజ్వాల:**

పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన నిరుపేద విశ్వబ్రాహ్మణ కుటుంబానికి చెందిన మారోజు బిష్మా చారి( అంధుడు), ఉపేంద్ర దంపతుల కుమార్తె జ్యోతి వివాహానికి ఆర్థిక సహాయం చేసి స్వర్ణకార సంఘం సభ్యులు ఔదార్యం చాటారు.అందుడు శంకరాచారి తన కుమార్తె వివాహం కోసం ఆర్థిక సహాయం కోసం వేచి చూస్తున్న తరుణంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం సభ్యులు తక్షణమే స్పందించి 65,000=00(అరవై ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్వరం బ్రహ్మచారి, సభ్యులు కొల్లోజు శ్రీనివాసాచారి,జనగామ పట్టణ అధ్యక్షులు వలబోజు చక్రపాణి, ప్రధానకార్యదర్శి సరాబోజు ఆంజనేయులు, పాలకుర్తి మండల సీనియర్ నాయకులు శ్రీపాద ఉప్పలాచారి, పెందోట వెంకటాచారి , పట్టణ అధ్యక్షులు ముత్తోజు రాజు, శ్రీపాద శ్రీరాములు, కొండపర్తి విష్ణు తదితరులు పాల్గొన్నారు.




తాను వచ్చే సంవత్సరం బంగ్లాదేశ్ లో జరగనున్న జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తానని మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యాఖ్యానించారు. ఒకవేళ తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకపోతే.. తమ లక్షలాది మంది మద్దతుదారులు ఎన్నికలను బహిష్కరిస్తారని చెప్పారు. ప్రధాని పీఠం నుంచి దిగిపోయి బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చిన మాజీ ప్రధాని షేక్ హసీనా(%వాష్త్రవఅనెష్ట్ర ఝుంఱఅఝ%) కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధాని నగరం ఢిల్లీలో తాను స్వేచ్ఛగా నివసిస్తున్నట్లు తెలిపారు. తన కుటుంబంపై జరిగిన హింసాత్మక దాడుల నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆందోళనలతో బంగ్లాదేశ్ లో అల్లర్లు చెలరేగడంతో ప్రధాని పీఠం నుంచి షేక్ హసీనా దిగిపోయారు. గతేడాది ఆగస్టు 5 నుంచి అక్కడి నుంచి వచ్చి ఇండియాలో తలదాచుకుంటున్నారు. ఈ అల్లర్లలో 1400 మంది మృతి చెందారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. చాలా కాలం తరువాత బుధవారం తొలిసారిగా ఆమె మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను వచ్చే సంవత్సరం బంగ్లాదేశ్‌లో జరగనున్న జాతీయ ఎన్నికల్లో పోటీ చేస్తానని వ్యాఖ్యానించారు. ఒకవేళ తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకపోతే.. తమ లక్షలాది మంది మద్దతుదారులు ఎన్నికలను బహిష్కరిస్తారని చెప్పారు. బంగ్లాదేశ్‌లో రాజ్యాంగ పాలన, రాజకీయ స్థిరత్వం తీసుకురావాలంటే మళ్ళీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో బంగ్లాలో అధికారం చేపట్టడానికైనా, ప్రతిపక్ష పాత్ర పోషించడానికైనా తమ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు.

తనపై అక్కడి యూనస్ ప్రభుత్వం చేసిన ఆరోపణలను హసీనా తీవ్రంగా ఖండించారు. అవన్నీ రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టడానికి చేసిన కుట్రగా పేర్కొన్నారు. తనపై అభియోగాలు నమోదు చేసే ముందు బంగ్లాలోని కోర్టులు కూడా తనకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని చెప్పారు. తాను దేశం విడిచాక అవామీ లీగ్ నేతలపై దాడులు చేయడం, పార్టీపై నిషేధం విధించడంతో తమ స్వీయ ఓటమిని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఒప్పుకుందని వ్యాఖ్యానించారు.




ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ , శాంసంగ్ ఛైర్మన్ లీ జే యాంగ్, హ్యుందాయ్ ఛైర్మన్ చుంగ్ యుయి-సన్ ల గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. వీరు ముగ్గురు దక్షిణ కొరియా లోని జియోంగ్జులో జరుగుతున్న ఏపీఈసీ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు వచ్చారు. నిత్యం ఎంతోమంది వివిధ రెస్టారెంట్లకు, హోటల్స్ కు వెళు_ంటారు. అక్కడ తమకు ఇష్టమైన ఫుడ్ ను ఆర్డర్ చేస్తారు. అలానే ఇటీవల ఓ ప్రాంతంలో రెస్టారెంట్ కు వెళ్లిన కస్టమర్లు ఎగిరి గంతేసే సంఘటన ఒకటి జరిగింది. వారి బిల్లులు మొత్తం ఓ ముగ్గురు ఫేమస్ బిలియనీర్లు చెల్లించారు. మరి.. ఈ ఘటన ఎక్కడ జరిగింది?. ఆ ముగ్గురు బిలియనీర్లు ఎవరు?, ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం... ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్, శాంసంగ్ ఛైర్మన్ లీ జే యాంగ్, హ్యుందాయ్ ఛైర్మన్ చుంగ్ యుయి-సన్ ల గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. వీరు ముగ్గురు దక్షిణ కొరియాలోని జియోంగ్జులో జరుగుతున్న ఏపీఈసీ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ క్రమంలో సియోల్‌లో అత్యంత ఫేమస్ అయిన క్యాన్‌బు చికెన్ రెస్టారెంట్ లో డిన్నర్ కు వెళ్లారు. వీరు చీజ్ బాల్స్, చీజ్ స్టిక్స్, బోన్‌లెస్ చికెన్, ఫ్రైడ్ చికెన్‌లతో పాటు మరికొన్ని డ్రింక్‌లను ఆర్డర్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురుబిలియనీర్లను చూసేందుకు అక్కడివారంతా గుమిగూడగారు. ఈ క్రమంలో హువాంగ్ తమను చూసేందుకు వచ్చిన ప్రజలకు చీజ్, ఫ్రైడ్ చికెన్‌ను బయటకు వచ్చి అందించారు. తరువాత అక్కడ ఉన్న వారితో లీ జే యాంగ్ ముచ్చటించారు. అంతేకాక ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీలు ఇచ్చి..అక్కడి వారిని సంతోష పెట్టారు. అక్కడి నుంచి వెళ్లిపోయే ముందు హువాంగ్ హోటల్ సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ క్రమంలో రెస్టారెంట్‌లోని కస్టమర్లందరి బిల్లులను తామే చెల్లిస్తామని హువాంగ్ ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న కస్టమర్లు ఆశ్చర్యపోయారు. వీరి డిన్నర్ డేట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలుప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. తాము వెళ్లే రెస్టారెంట్లకు ఈ బిలియనీర్లు ఒకసారి వస్తే బాగుండూ అంటూ కొందరు నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు.




అమెరికా మాజీ అధ్యక్షుడు, దివంగత రిపబ్లికన్ నేత రోనల్డ్ రీగన్ కామెంట్స్ ఉన్న యాడ్ వివాదాస్పదం కావడంతో తాను డొనాల్డ్ ట్రంప్‌కు క్షమాపణ చెప్పాననని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తాజాగా తెలిపారు. సుంకా లకు వ్యతిరేకంగా ప్రచురితమైన వివాదాస్పద యాడ్‌పై తాను అమెరికా ప్రెసిడెంట్‌కు క్షమాపణలు చెప్పానని కెనడా ప్రధాని మార్క్ కార్నీ శనివారం తెలిపారు. ఈ యాడ్ ట్రంప్‌నకు కోపం తెప్పించిందని అన్నారు. దక్షిణ కొరియాలో ఉన్న ఆయన జర్నలిస్టులతో ఈ కామెంట్స్ చేశారు. అమెరికాతో వాణిజ్య చర్చలు త్వరలో మొదలవుతాయని కూడా చెప్పారు. ఇందుకు అమెరికా సిద్ధంగా ఉందని అన్నారు ట్రంప్ ప్రభుత్వం విధించిన టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ కెనడాలోని ఓంటారియో ప్రావిన్స్ ప్రభుత్వం ఇటీవల ఓ యాడ్‌ను ప్రసారం చేసింది. అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ దివంగత నేత రొనాల్డ్ రీగన్ అప్పట్లో సుంకాలపై చేసిన కామెంట్స్‌ను యాడ్‌లో చేర్చింది. సుంకాల వల్ల అమెరికాకు నష్టం అని రీగన్ అన్నట్టు యాడ్‌లో కనిపించింది. ఈ యాడ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత వారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన పార్టీకి చెందిన ప్రముఖ నేత కామెంట్స్‌ను దుర్వినియోగ పరిచారంటూ మండిపడ్డారు. దీంతో, యాడ్‌ను తొలగిస్తామని రాజీకొచ్చిన కెనడా ఆ వారాంతంలో మాత్రం యాడ్ యథావిధిగా ప్రసారం అవుతుందని స్పష్టం చేసింది. దీంతో, ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమైపోయారు. వారాంతంలో మాత్రం యాడ్ ప్రసారం అవుతుందని చెప్పడం దుందుడుకుతనమే అని మండిపడ్డారు. కెనడాతో వాణిజ్య చర్చల్లో జరగవని తేల్చి చెప్పారు. అదనంగా 10 శాతం టారిఫ్‌ను విధిస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కెనడా వెనక్కు తగ్గింది. ట్రంప్‌నకు క్షమాపణలు చెప్పినట్టు కెనడా ప్రధాని కార్నీ తాజాగా మీడియా ముఖంగా చెప్పారు. ఇక చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో తాజాగా జరిగిన వాణిజ్య చర్చలు ఓ మేలి మలుపని కూడా ప్రధాని కార్నీ అభివర్ణించారు. కెనడా వ్యవహారాల్లో విదేశీ జోక్యం వంటి సున్నితమైన అంశాన్ని కూడా చైనా అధ్యక్షుడితో ప్రస్తావించినట్టు తెలిపారు.

## పంట కోత ప్రయోగ పరీక్ష నిర్వహించిన ఏ ఎస్ ఓ



**కొల్చారం, ప్రజాజ్వాల:**
మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో మండల ప్రణాళిక గణాంక అధికారి వై. కృష్ణ 2025 26 సంవత్సరం వర్షాకాలం సీజన్ కి సంబంధించి పంట కోత ప్రయోగ పరీక్షను నిర్వహించారు.శనివారం గ్రామానికి చెందిన మహిళా రైతు పోషాల మానెమ్మ భర్త దుర్గయ్యకు చెందిన వరి పొలంలో ఈ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ కృష్ణ మాట్లాడుతూ 25 మీటర్ల చదరపు విస్తీర్ణంలో గల వరి పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని తూకం వేయగా 18.120 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఈ ప్రయోగం ఆధారంగా ఒక్కో హెక్టార్కు వచ్చే దిగుబడి శాతాన్ని అంచనా వేస్తారన్నారు. మండలంలో వేసే ప్రధాన పంటలపై ఈ పంట కోత ప్రయోగ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ ప్రయోగాల ద్వారా జిల్లా స్థాయిలో ఉత్పత్తి, ఉత్పాదకతను అంచనా వేయుటకు, జిల్లా మరియు రాష్ట్రస్థాయిలలో స్థూల ఆదాయాన్ని లెక్కించుటకు, పంటల వారీగా ఎగుమతులు దిగుమతులకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయాల అమలుకు ఈ సమాచారం తోడ్పడుతుందన్నారు. పంటకోత ప్రయోగ పరీక్ష కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ చారి, డివిజనల్ ఉపగణాంక అధికారి జ్యోతి, గ్రామ జిపిఓ ఎండి హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరం




**రాజేంద్రనగర్, ప్రజాజ్వాల:**
మాదకద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని ఐసిడిఎస్ శేర్ లింగంపల్లి ప్రాజెక్టు సూపర్ వైజర్ పద్మజ తెలిపారు. ఈ అలవాట్లకు ఎవరు బానిస కాకూడదని సూచించారు. శనివారం రాజేంద్ర నగర్ సర్కిల్ మైలార్దేవ్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం – వాటి వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ, పోలీస్ విభాగం అధికారులు, సిబ్బంది, మైలార్దేవ్ పల్లి పోలీసులు, ఆశా వర్కర్లు, ఏ ఎన్ ఎం లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## జోనల్ క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి

### – రాష్ట్ర గురుకుల విద్యాసంస్థ డిప్యూటీ సెక్రటరీ రజిని.



**హత్నూర, ప్రజా జ్వాల:**
హత్నూర గురుకుల కళాశాలలో నిర్వహించే 11 వ జోనల్ క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర గురుకుల విద్యా సంస్థ డిప్యూటీ సెక్రటరీ రజిని అన్నారు. శనివారం హత్నూర గురుకుల కళాశాలలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ నెల 6 నుంచి 8 వరకు 11వ జోన్ మీట్ నిర్వహణ ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా నిర్వహించాలని సూచించారు . జోన్ (ఏ) పరిధిలోని 11 పాఠశాల క్రీడాకారులకు హత్నూర గురుకుల కళాశాల, జోన్ (బి) పరిధిలోని 11 క్రీడాకారులకు వికారాబాద్ జిల్లా శివారెడ్డిపేట క్రీడలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ సమక్ష సమావేశంలో ప్రిన్సిపాల్ తో పాటు పిడి గణపతి ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డికు జూబ్లీహిల్స్ ప్రచారంపై ఉన్న శ్రద్ధ పాలకుర్తి ప్రజలపై లేదు

### -మొంథా తుఫాన్ తో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

### -బిజెపి మండల అధ్యక్షుడు మారం రవికుమార్

**పాలకుర్తి, ప్రజాజ్వాల:**
ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా పాలకుర్తి మండలం లోని కురిసిన భారీ వర్షాలకు రైతులు వరి మొక్కజొన్న పత్తి పంటలు విపరీతంగా నష్టపోయారని ఈ తుఫాను రైతులకు అప్పులు మిగిల్చి వారికి శాపంగా మారింది అని, తుఫాను కారణంగా నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు 30 వేల నష్టపరిహారం మొక్కజొన్నకు ఎకరాకు 30 వేల నష్టపరిహారం వరికి ఎకరాకు 50 వేల నష్టపరిహారం చెల్లించాలని పాలకుర్తి బిజెపి మండల అధ్యక్షులు రవి కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కు జూబ్లీ హిల్స్ ప్రచారంపై ఉన్న శ్రద్ధ పాలకుర్తి ప్రజలపై లేదని, ఒక్కరోజు ఏదో పైపైన తిరిగితే రైతుల కష్టం ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పట్టించుకొని, ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని కాలయాపన చేయకుండా వెంటనే నష్టాన్ని అంచనా వేసి రైతుల పొలాలను సర్వే చేసి నష్టపరిహారాన్ని వారి ఖాతాలో జమ చేయాలని అన్నారు.



## మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారుల పై చర్యలు

**ఉమ్మడి మెదక్ జిల్లా, నవంబర్1, ప్రజాజ్వాల:**
దుబ్బాక నియోజకవర్గం లోని దుబ్బాక పట్టణంలో సిఐ.పి శ్రీనివాస్ మాట్లాడుతూ..డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారికి 10 వేల రూపాయల జరిమానా విధించడం లేదా ఆరు నెలలు జైలు శిక్ష అమల్లోకి రావడం జరిగింది మరియు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుంది.మద్యం సేవించి రెండవసారి వాహనం నడుపుతూ పట్టుపడితే 15 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుంది.జరిమానా డబ్బులు కట్టని వారికి, జైలు శిక్ష విధించడం జరుగుతుంది.ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదు దుబ్బాక సిఐ పి శ్రీనివాస్ ఈ సందర్భంగా దుబ్బాక సిఐ పి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 10 వేల రూపాయల జరిమానా లేదా ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం, రెండవసారి మద్యం సేవించి వాహనం నడిపే వారిపై 15 వేల రూపాయల



జరిమానా, కట్టని వారికి జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు.వాహనదారులకు ప్రజలకు విజ్ఞప్తి ఎట్టి పరిస్థితుల్లో కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు, మరియు మైనర్లు వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దు, తల్లి తండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని మరియు సైలెన్సర్ మార్చి వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వాహనాలు నడిపేటప్పుడు వ్యక్తిగత భద్రత నియమాలు తప్పకుండా పాటించాలి.పై నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన మిరుదొడ్డి మండల ఎంపీడీఓ

**ఉమ్మడి మెదక్ జిల్లా, నవంబర్ 1, ప్రజాజ్వాల:**
మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను మిరుదొడ్డి ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం సూచించిన విధంగా లబ్ధిదారులు తమ ఇండ్లను నిర్మించుకోవాలని ఇందిరమ్మ ఇండ్ల వినియోగదారులకు మిరుదొడ్డి ఎంపీడీఓ సూచించారు. మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు లింగుపల్లి మల్లుపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన మిరుదొడ్డి ఎంపీడీవో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేసుకొని మీ సొంత కలను నిజం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మిరుదొడ్డి ఎంపీడీఓ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం సూచించిన విధానంగా లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టుకోవాలని ఇందిరమ్మ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం సూచించిన విధానంగా లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టుకోవాలని ఇందిరమ్మ ఇండ్ల వినియోగదారులు తమ ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఇండ్ల నిర్మాణ పరులు త్వర త్వరగా పూర్తి చేసుకుని గవర్నమెంట్ నుంచి వచ్చే విడతల వారి బిల్లులను



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని మిరుదొడ్డి ఎంపీడీవో ఈ సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో మీరు దొడ్డి ఎంపీడీవో తో పాటు మిరుదొడ్డి కారవారి కుమార్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో దుబ్బాక నియోజకవర్గంకు నిధులు మంజూరు



**ఉమ్మడి మెదక్ జిల్లా, ప్రజాజ్వాల:**
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హైదరాబాదులో దుబ్బాక నియోజకవర్గం సంబంధించిన పంచాయతీరాజ్ మరియు రోడ్లు, భవనాలు శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించి %నావీ% కింద 30 కోట్ల 62 లక్షలు ఇటీవల మంజూరైనట్లుగా అధికారులు తెలిపారు. మరో 30 కోట్ల నిధులతో 25 రోడ్లను ప్రతిపాదించడం జరిగింది అని చెప్పారు. మరొక 20 కోట్లకు సంబంధించిన 30 రోడ్లను నూతనంగా ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రోడ్లు మరియు భవనాల శాఖ రోడ్లకు సంబంధించి దుబ్బాక నియోజకవర్గం లో ఎనగుర్తి నుంచి శిలాజి నగర వరకు మరియు ముందు చింత నుండి బేగంపేట వరకు రెండు రోడ్లను 67 కోట్లతో ప్రతిపాదించడం జరిగింది. అదేవిధంగా 10 కోట్ల 40 లక్షల కు ఐదు బాక్సు కల్వర్టుల ను ప్రతిపాదించడం జరిగింది .40 కోట్ల కోసం హబ్సీ పూర్ నుంచి దుబ్బాక ఫోర్ లైన్ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగింది.సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ నాయుడు, డి వెంకటేష్ , పంచాయితీ రాజ్ డి ఈ ఈ లు విజయ్ ప్రకాష్ సూర్య ప్రకాష్ లు మరియు రెండు శాఖల.ఏ ఈ ఈ లు పాల్గొన్నారు.

## నీళ్ల పాలైన రైతు కష్టం

### -రియలేస్టేట్ చేసే రేవంత్ రెడ్డికి రైతుల బాధ ఏం తెలుస్తుంది ?

### - ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలి

### - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్

### -జనగామ జిల్లా కలెక్టర్ కి రైతుల పక్షాన వినతి పత్రం అందజేత

**జనగామ జిల్లా, ప్రజాజ్వాల:**
రియలేస్టేట్ చేసే రేవంత్ రెడ్డికి రైతుల బాధ ఏం తెలుస్తుంది అని,ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా కలెక్టర్ కి రైతుల పక్షాన వినతి పత్రం అందజేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురంలో నేలమట్టమైన పంటలను పరిశీలించి, రైతులకు భరోసా ఇచ్చారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు కారణంగా పంటలు పూర్తిగా నేలమట్టం కావడంతో తీవ్రంగా నష్టపోయిన రైతు పోగు అశోక్ ని పరామర్శించారు. చేతికొచ్చిన పంట కళ్లెదుటే నీటిపాలవ్వడంతో కన్నీరుమున్నీరవుతున్న రైతుల గోడును ఆయన అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న వరి, పత్తి ఇతర పంట పొలాలను పరిశీలించి, రైతుల పరిస్థితిని చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులు సర్వం కోల్పోయారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట ఇలా నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. వారిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది,” అని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. “ప్రభుత్వం కేవలం ప్రకటనలకు, హామీలకు పరిమితం కాకుండా నష్ట పోయిన ప్రతి రైతు కు వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి. రైతులు అధైర్య పడొద్దు. మీకు న్యాయం జరిగే వరకు మీ పక్షాన పోరడుతాను అని అన్నారు.ఇదంతా ఈ కాంగ్రెస్ అసమర్ధ పాలనా వల్లనే ఇంత నష్టం జరిగింది అదే సమయానికి నీళ్లు, యూరియా ఇచ్చి కొనుగోళ్లు సెంటర్ ఏర్పాట్లు పూర్తి చేస్తే ఇంత నష్టం ఉండేది కాదు కాబట్టి దీనికే ఈ ప్రభుత్వమే బాధ్యత తీసుకొని నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నేడు జగద్గిరిగుట్ట బస్ స్టాప్ వద్ద సదర్ సమ్మేళనం

### -మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను ఆహ్వానించిన జెకే శేఖర్ యాదవ్

**జగద్గిరిగుట్ట, ప్రజాజ్వాల:**
సనత్ నగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు నవంబర్ 2 ఆదివారం కుత్బుల్లాపూర్ సదర్ సమ్మేళనం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిందిగా సదర్ కమిటీ అధ్యక్షులు జే కే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ ప్రతాప్ గారు మల్లేష్ సదర్ కమిటీ ప్రధాన కార్యదర్శి సాదు యాదవ్ గారు కుమార్ యాదవ్ రేణుక యాదవ్, కుత్బుల్లాపూర్ మహిళా అధ్యక్షురాలు. కుమార్ యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రా కూల్చినా ఆగని కబ్జాలు

## – పరికి చెరువు పరిరక్షణ కమిటీ ఆరోపణ



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ మండలంలోని జగతగిరిగుట్ట, ఎల్లమ్మ బండ, కూకట్పల్లి లోని ఆల్విన్ కాలనీ లో విస్తరించి ఉన్న పరికి చెరువును రక్షించాలని కోరుతూ గత కొద్ది సంవత్సరాల నుండి చెరువు పరిరక్షణ కమిటీ పేరుతో ఉద్యమిస్తుంటే హైడ్రాలో వినతిపత్రం సమర్పించటం వల్ల గత ఫిబ్రవరి నెలలో హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చడం జరిగిందని కానీ మళ్ళీ కూల్చిన చోట నిర్మాణాలు జరగడమే కాకుండా మరింత విస్తరించాయని కమిటీ సభ్యులు ఆరోపించారు. ఇలాగే కొనసాగితే పరికి చెరువు ఆనవాళ్ళు లేకుండా పోయే ప్రమాదం ఉంది కాబట్టి హైడ్రా మరోసారి దృష్టి పెట్టి అక్రమంగా ఏర్పడ్డ నిర్మాణాలను కూల్చివేసి ఉన్న పరికి చెరువునైన కాపాడాలని జగద్గిరి గుట్ట లో పరికి చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు సమావేశామై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రా ఇతర చెరువులను అభివృద్ధి చేసినట్టు పరికి చెరువు ను అభివృద్ధి చెయ్యాలి. సరిహద్దులను నిర్ణయించి హద్దులను ఏర్పాటు చెయ్యాలి. అక్రమంగా కబ్జా చేస్తూ స్థలాన్ని అమ్ముతున్న కబ్జాదారుడి పై పిడి యాక్ట్ అమలు చెయ్యాలి. ఈ విషయం పై స్పందన రాకపోతే మరోసారి హైడ్రా కు వినతిపత్రం ఇవ్వడమే కాకుండా ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టుతామణి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరికి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉమా మహేష్,సభ్యులు సాయి పంతులు,పవన్,ప్రవీణ్,బాబు,సహాదేవ్ రెడ్డి లు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్‌కు మద్దతుగా కొలన్‌తో కలిసి శ్రవణ్ కుమార్ ప్రచారం



**కుత్బుల్లాపూర్,ప్రజాజ్వాల:**
కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి మద్దతుగా జూబ్లీహిల్స్ లో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డితో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ప్రచారం చేశారు. వారి తో కలిసి ప్రచారంలో డాక్టర్ ఆవిజ జేమ్స్, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, ఎక్స్ సర్పంచ్ దాబాశ్రీను, ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డివిజన్ల అధ్యక్షులు పెరికి శివ సంతోష్ ముదిరాజ్, గణేష్, పండరీ రావు, ఎండి లాయక్ బాయ్, ఎండి జాకీర్ భాయ్, పాల్గొన్నారు.

# మెయిన్ సెక్షన్ 60 అడిషనల్ సెక్షన్ 55ను కొనసాగించాలి

## -డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి ఆధ్వర్యంలో వినతి





**హైదరాబాద్, ప్రజాజ్వాల:**
మెయిన్ సెక్షన్ 60, అడిషనల్ సెక్షన్ 55ను కొనసాగించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కమిషనర్ బోర్డ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడిషనల్ సెక్షన్ ఆన్లైన్ లో కట్ ఆఫ్ 40 చూపిస్తున్నట్టు కాకుండా మెయిన్ సెక్షన్ 60 అడిషనల్ సెక్షన్ 55ను కొనసాగించాలని మెమోరండం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారులు జేఎస్ పరంజ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి ఎస్ జయసింహ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డేనియల్ రాజు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

## -సీఐ గడ్డం మల్లేష్
## -జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో సిబ్బంది శ్రమదానం





**కుత్బుల్లాపూర్,ప్రజాజ్వాల:**
ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ అన్నారు.శనివారం జీడి మెట్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్నటువంటి పిచ్చి మొక్క లు తొలగించి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశు భ్రంగా చేశారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ కలిసి శ్రమదానం చేయడం ద్వారా పూర్తిగా పరిసరాలు పరిశుభ్రంగా మార్చారు. దాదాపు మూడు ట్రక్కుల చెత్తను తీసి వేయడం ద్వారా ప్రాంతంలో టెన్నిస్ అలాగే వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేసినటటు సీఐ గడ్డం మల్లేష్ అన్నారు.

# అభివృద్ధి సంక్షేమాలే కాంగ్రెస్ ఎజెండా

-జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం
-నీలం మధు ముదిరాజ్..
-షేక్ పేట్ గల్లి గల్లీ లో పెద్ద ఎత్తున్న నీలం ప్రచారం
-వేల్డింగ్, చికెన్, టైలర్, టిఫిన్ సెంటర్ లలో కోలాహలంగా సాగిన ప్రచారం..
-ఇంటి ఇంటికి తిరుగుతూ ఓటర్లను కలిసిన నీలం..






**పటాన్ చెరు, ప్రజాజ్వాల:**
అభివృద్ధి సంక్షేమాలే ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పని చేస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్ పేట్ డివిజన్ పరిధిలోని వినోబా నగర్, సాయి రామ్ నగర్, సీతా నగర్ కాలనీలలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరు గ్యారెంటీ ల అమలు చేస్తూ ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. జనాభా ప్రతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో బీసీ బిల్లుపై అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీలను ప్రోత్సహిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ బిజెపి పార్టీలు అగ్రవర్ణాలకు టికెట్లు ఇస్తే కాంగ్రెస్ పార్టీ బీసీ బిడ్డ నవీన్ యాదవ్ ను బరిలో నిలిపిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తట్టుకోలేక అడ్డంకులు సృష్టించిన బిఆర్ఎస్ బిజెపి పార్టీలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో యాదవ బిడ్డ నవీన్ కు టికెట్ ఇస్తే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ఆ రెండు పార్టీల రాజకీయ కుట్రలను తట్టుకోవాలంటే బీసీలంతా ఒక తాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. బీసీలను మోసం చేస్తున్న రెండు పార్టీలకు తగిన గుణపాఠం నేర్పాలంటే నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో షేక్ పేట్ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు మురారి గాంధీ, బాలకృష్ణ, విగ్నేష్, బాబురావు,సతీష్ యాదవ్, ప్రదీప్ గౌడ్, రామకృష్ణ, ధనరాజ్, గోవర్ధన్, ఓంకార్, సేవాదళ్, యూత్ కాంగ్రెస్, నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, ఎన్ఎంఆర్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు..

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా స్టార్ క్యాంపెనర్ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మాల్ రెడ్డి రామ్ రెడ్డితో కలిసి కుత్బుల్లాపూర్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్‌యాదవ్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# కెవిఆర్ లేఔట్ రూ.100 కోట్ల విలువైన పార్క్ స్థలాలు కబ్జా

## -వెంటనే కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
## -మున్సిపల్ అధికారులకు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు



**నిజాంపేట్, ప్రజాజ్వాల:**
కెవిఆర్ లేఔట్ లో 100కోట్ల విలువైన 10పార్కుల స్థలం కబ్జా చేసినా పోలీసులకు ఫిర్యాదు చేయని మున్సిపల్ అధికారుల తీరుపై ఆకుల సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం దుండిగల్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లంపేట నందు కెవిఆర్ లేఔట్ 54ఎకరాల వెంచర్ 2004 వేయడం జరిగింది. కానీ టిఆర్ఎస్ పాలనలో స్థానిక ఎమ్మెల్సీ రాజు తమ్ముడు అండదండలు సహకారంతో నరేష్ వారు మిత్రులు కలిసి దాదాపు పది పార్కు స్థలాలు కబ్జా చేయడమే కాకుండా దాదాపు 100 కోట్ల విలువైన పార్క్ ఆస్తికి తప్పుడు పత్రాలు సృష్టించి వెంచర్ వేసిన కెవి రామరాజు పేరు మీద సంతకం ఫోర్జరీ చేసి హైకోర్టు నుండి ఉత్తర్వులు పేరుతో పార్కులు రిజిస్ట్రేషన్లు చేయడంపై గతంలోనే మేము ఫిర్యాదు చేశామన్నారు. నామ మాత్రం కూల్చివేతలు చేశారు కానీ, దీనిపై మున్సిపల్ అధికారులు కేసును నమోదు చేయలేదన్నారు. చివరికి 2024 సూరారంలో అక్రమ గన్ తో నరేష్ కాల్పులు జరపడం తర్వాత పోలీస్ అధికారులు కెవి రామరాజు ఇచ్చిన పార్క్ స్థలాల కబ్జాపై ఫిర్యాదు ఆధారంగా నరేష్ వారి మిత్రులపై (737/2024) దుండిగల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి ముగించారని తెలిపారు. అసలు అండదండలు సాకారం అందించిన ఎమ్మెల్సీ రాజు కౌన్సిలర్ కృష్ణ పాత్ర పై విచారణ జరపలేదు. చివరికి ప్రస్తుతం కె.వి.ఆర్ లేఔట్ లో అప్పట్లో కూల్చివేసిన పార్క్ స్థలాలు ప్రస్తుతం అధికార పార్టీ నేత తో నరేష్ అనే వ్యక్తి మళ్లీ చేతులు కలిపి మళ్లీ అమ్మకాలు చేయడంపై తక్షణమే కెవిఆర్ లేఔట్ లో పార్కు స్థలాల్లో ఆక్రమించుకున్న అన్ని నిర్మాణాలను కూల్చివేసి, పార్కులను పరిరక్షించడానికి ఫెన్సింగ్ వేసి రక్షించడమే కాకుండా నరేష్ మిత్రులు ఎమ్మెల్సీరాజు వాళ్ళ తమ్ముడు కృష్ణ పాత్ర పై కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అని మున్సిపల్ అధికారులకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి ,శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన జైపాల్ నాయక్



**సంగారెడ్డి జిల్లా, ప్రజాజ్వాల:**
తెలంగాణ రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు మృతి చెందడంతో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్ శనివారం వారి స్వగృహం హైదరాబాద్ లో పరామర్శించారు. అనంతరం తన్నీరు సత్య నారాయణ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు హరీష్ రావు కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుదర్శన్, మాజీ ఉప సర్పంచ్ ప్రకాష్ నాయక్, అరుణ్ నాయక్ లు పాల్గొన్నారు.




## శ్రేయస్ అయ్యర్ హెల్త్ అప్డేట్.. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్.. స్వదేశానికి ఎప్పుడు వస్తారంటే?

ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అభిమానులకు గుడ్ న్యూస్. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో క్యాచ్ పట్టినప్పుడు కింద పడటంతో అయ్యర్‌కు ప్లీహం వద్ద తీవ్ర గాయమైంది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అభిమానులకు గుడ్ న్యూస్. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో క్యాచ్ పట్టినప్పుడు కింద పడటంతో అయ్యర్‌కు ప్లీహం వద్ద తీవ్ర గాయమైంది. దీని కారణంగా ఆయన సిడ్నీలోని ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. అయితే ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. భారత క్రికెట్ జట్టు ఆటగాడు శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో గాయపడ్డారు. మ్యాచ్ సందర్భంగా ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ కారీ క్యాచ్ పట్టే క్రమంలో ఆయన కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో అయ్యర్‌కు పొత్తికడుపు వద్ద తీవ్ర గాయమై, ముఖ్యంగా ప్లీహం వద్ద దెబ్బ తగిలింది. దీని కారణంగా అంతర్గత రక్తస్రావం మొదలైంది. గాయం తీవ్రతను గుర్తించిన వైద్య బృందం వెంటనే అయ్యర్‌ను ఆసుపత్రికి తరలించి ఐసీయూలో ఉంచి చికిత్స అందించింది. ఈ సంఘటన అక్టోబర్ 25, 2025న జరిగింది. అయ్యర్ ఆరోగ్యంపై స్పందించిన బీసీసీఐ తాజాగా ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. అయ్యర్‌కు జరిగిన అంతర్గత రక్తస్రావాన్ని వెంటనే ఆపడానికి ఒక చిన్నపాటి ఆపరేషన్ నిర్వహించారు. దీనివల్ల రక్తస్రావం త్వరగా ఆగిపోయిందని బీసీసీఐ తెలిపింది. బీసీసీఐ మెడికల్ టీం సిడ్నీ భారతదేశంలోని డాక్టర్ల సహకారంతో చికిత్స అందించింది. ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, ఆయన వేగంగా కోలుకుంటున్నందుకు సంతోషంగా ఉందని బీసీసీఐ ప్రకటించింది. అందుకే ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

## స్పాన్సర్‌షిప్ లేకున్నా నాకు అదే కావాలి.. జెమీమా రోడ్రిగ్స్ బ్యాట్?లో అంత స్పెషల్ ఏముంది ?

మహిళల వన్డే ప్రపంచ కప్ రెండో సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుతమైన విజయాన్ని అందించిన భారత జట్టు బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ గురించి ఇప్పుడు అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ మ్యాచ్‌లో జెమీమా 134 బంతుల్లో అజేయంగా 127 పరుగులు చేసి, టీమిండియాను 8 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేర్చింది.మహిళల వన్డే ప్రపంచ కప్ రెండో సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుతమైన విజయాన్ని అందించిన భారత జట్టు బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ గురించి ఇప్పుడు అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ మ్యాచ్‌లో జెమీమా 134 బంతుల్లో అజేయంగా 127 పరుగులు చేసి, టీమిండియాను 8 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేర్చింది. అయితే, ఆమె బ్యాటింగ్ మాత్రమే కాదు, ఆస్ట్రేలియా బౌలర్లను చితకబాదడానికి ఆమె ఉపయోగించిన బ్యాట్ కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జెమీమా కోసం ప్రత్యేకంగా తయారుచేసిన ఆ బ్యాట్ ప్రత్యేకత ఏమిటి? అది ఆమెకు ఎలా అందింది? అనే వివరాలను చూద్దాం.నవీ ముంబైలో జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్ రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, భారత జట్టుకు 339 పరుగుల కష్టతరమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో జెమీమా రోడ్రిగ్స్ కీలకపాత్ర పోషించింది. ఆమె 134 బంతుల్లో 14 ఫోర్ల సహాయంతో అజేయంగా 127 పరుగుల చారిత్రక ఇన్నింగ్స్ ఆడింది. ఆమె పోరాటం కారణంగానే భారత జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించి, 8 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది.జెమీమా రోడ్రిగ్స్ ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్ వెనుక ఆమె ఉపయోగించిన ఎస్‌జీ కంపెనీకి చెందిన బ్యాట్ కూడా ఒక కారణంగా నిలిచింది. ఈ బ్యాట్‌కు ఒక ప్రత్యేక కథ ఉంది. ఎస్‌జీ కంపెనీ సీఈఓ పారస్ ఆనంద్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. జెమీమాకు తమతో అప్పుడు స్పాన్సర్‌షిప్ కాంట్రాక్ట్ లేదని తెలిపారు. కానీ భారత జట్టులోని ఇతర ఆటగాళ్లు ఉపయోగిస్తున్న తమ ఎస్‌జీ బ్యాట్‌లను చూసిన జెమీమా ఆ ఆకారం, బ్యాలెన్స్ తన ఆటతీరుకు సరిపోతాయని భావించింది.దాదాపు మూడేళ్ల క్రితం, జెమీమా ఏజెన్సీ తమను సంప్రదించి ఆమె కోసం తమ బ్యాట్‌లను కొనుగోలు చేసేదని ఆయన చెప్పారు. క్రికెట్‌లో స్పాన్సర్‌షిప్‌లు చాలా కీలకం. కానీ జెమీమా, తనకు కాంట్రాక్ట్ లేకపోయినా తాను ఇష్టపడిన ఎస్‌జీ బ్యాట్‌కే కట్టుబడి ఉండాలని నిర్ణయించుకుంది.



జెమీమాకు ఇతర సంస్థల నుంచి స్పాన్సర్‌షిప్ ఆఫర్‌లు వచ్చినప్పుడు, ఆమె వాటిని అంగీకరించింది. కానీ బ్యాట్ స్పాన్సర్‌షిప్ మాత్రం ఎస్‌జీతోనే చేసుకోవాలని కోరుకుంది.జెమీమా కోసం ఎస్‌జీ ప్రత్యేకంగా డక్‌విల్ షేప్?లో బ్యాట్‌ను తయారుచేసింది. ఇది ఇతర బ్యాట్‌ల కంటే తేలికగా ఉంటుంది. ఈ తేలికపాటి బ్యాట్‌తోనే జెమీమా సులభంగా భారీ షాట్లు ఆడగలిగింది. ఈ ప్రత్యేక డిజైన్ సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా బౌలర్లను ఎదుర్కోవడానికి ఆమెకు ఎంతో సహాయపడింది.




## ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్‌కు వర్షం ముప్పు.. రిజర్వ్ డే కూడా రద్దైతే ట్రోఫీ ఎవరికి ఇస్తారు?

మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో భారత మహిళల జట్టు, సౌతాఫ్రికా మహిళల జట్టు మధ్య ఈ టైటిల్ పోరు జరగనుంది. అయితే, ఈ చారిత్రక మ్యాచ్‌పై ఇప్పుడు వర్షం ముప్పు పొంచి ఉంది. మహారాష్ట్రకు ఎల్లో అలర్ట్ జారీ అయినందువల్ల ఫైనల్ రోజు (ఆదివారం), రిజర్వ్ డే (సోమవారం) నాడు కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో భారత మహిళల జట్టు, సౌతాఫ్రికా మహిళల జట్టు మధ్య ఈ టైటిల్ పోరు జరగనుంది. అయితే, ఈ చారిత్రక మ్యాచ్‌పై ఇప్పుడు వర్షం ముప్పు పొంచి ఉంది. మహారాష్ట్రకు ఎల్లో అలర్ట్ జారీ అయినందువల్ల ఫైనల్ రోజు (ఆదివారం), రిజర్వ్ డే (సోమవారం) నాడు కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఒకవేళ రిజర్వ్ డే రోజు కూడా మ్యాచ్ జరగకపోతే ట్రోఫీని ఏ జట్టుకు ఇస్తారు? ఐసీసీ నిబంధనలు ఏమి చెబుతున్నాయో వివరంగా తెలుసుకుందాం. మహిళల వన్డే ప్రపంచ కప్ చరిత్రలోనే ఈసారి ఫైనల్ ప్రత్యేకంగా నిలవనుంది. ఎందుకంటే ఈసారి ప్రపంచ కప్ ఫైనల్‌లో సంప్రదాయ అగ్రశ్రేణి జట్లు ఆస్ట్రేలియా లేదా ఇంగ్లాండ్ లేవు. ఈసారి ఫైనల్‌కు చేరిన భారత జట్టు, సౌతాఫ్రికా జట్టు రెండూ ఇప్పటివరకు వన్డే ప్రపంచ కప్‌ను గెలవలేదు.

భారత్ మూడోసారి ఫైనల్‌కు చేరుకోగా, దక్షిణాఫ్రికా తొలిసారి ఫైనల్ ఆడబోతోంది. కాబట్టి, విజేత ఎవరైనా కొత్త ప్రపంచ ఛాంపియన్ ఖాయం. డీవై పాటిల్ స్టేడియంలోనే జరిగిన సెమీఫైనల్‌లో జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) చారిత్రక ఇన్నింగ్స్‌తో భారత్, 7 సార్లు ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించింది. మరో సెమీఫైనల్‌లో సౌతాఫ్రికా, ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు వచ్చింది. నవీ ముంబై, డీవై పాటిల్ స్టేడియంలో ఆదివారం (నవంబర్ 2) మధ్యాహ్నం 3 గంటలకు ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, వాతావరణ అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి.మహారాష్ట్రలోని ముంబై, పరిసర ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. దీని కారణంగా వర్షాలు పడే అవకాశం ఉంది. వాతావరణ సంస్థల అంచనాల ప్రకారం.. ఆదివారం మ్యాచ్ రోజున 63 శాతం వర్షం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సాయంత్రం 4 నుంచి 7 గంటల మధ్య 50 శాతం వర్ష సూచన ఉంది. గతంలో ఇదే స్టేడియంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన లీగ్ మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దయింది.ఫైనల్ మ్యాచ్ కోసం ఐసీసీ రిజర్వ్ డేను కేటాయించింది. ఆదివారం మ్యాచ్ జరగకపోతే, సోమవారం (నవంబర్ 3) రోజున మిగిలిన ఆట కొనసాగుతుంది. ఆదివారం రోజున మ్యాచ్ మధ్యలో ఎక్కడైతే ఆగిపోతుందో, రిజర్వ్ డే రోజున అక్కడి నుంచే ఆట కొనసాగుతుంది. ప్రధాన ఉద్దేశం, 50 ఓవర్ల మ్యాచ్‌ను పూర్తి చేయడమే. ఒకవేళ ఆదివారం, సోమవారం రిజర్వ్ డే రోజున కూడా వర్షం కారణంగా మ్యాచ్ పూర్తి చేయలేని పరిస్థితి ఏర్పడితే (కనీసం ఓవర్ల కోతతో కూడా సాధ్యం కాకపోతే), ఐసీసీ నిబంధనల ప్రకారం భారత మహిళా జట్టు, సౌతాఫ్రికా మహిళా జట్టులను ఉమ్మడి విజేతలుగా ప్రకటిస్తారు.

## మూడోసారి ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్.. మన అమ్మాయిలు 20ఏళ్ల నాటి చరిత్రను మారుస్తారా ?

2025 నవంబర్ 2న డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో క్రికెట్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం లిఖించనున్నారు. మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 ఫైనల్ మ్యాచ్ భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతుంది. ఒకవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు తమ సొంత గడ్డపై కప్ కరువును తీర్చుకోవడానికి బరిలోకి దిగుతుంది. 2025 నవంబర్ 2న డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో క్రికెట్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం లిఖించనున్నారు. మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 ఫైనల్ మ్యాచ్ భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతుంది. ఒకవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు తమ సొంత గడ్డపై కప్ కరువును తీర్చుకోవడానికి బరిలోకి దిగుతుంది. మరోవైపు లారా వోల్వార్డ్‌తో కూడిన సౌతాఫ్రికా జట్టు ఉంది. ఇది మొదటిసారి ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. కానీ ఈ మహా సంగ్రామంలో భారత్, సౌతాఫ్రికా స్ట్రాంగ్ జట్టు మాత్రమే కాదు. ఒక 20 ఏళ్ల పాత రికార్డు కూడా సవాలుగా నిలుస్తుంది. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఈసారి క్రికెట్ ప్రపంచం ఒక కొత్త ఛాంపియన్‌ను చూస్తుంది. భారత్, సౌతాఫ్రికా ఇంతవరకు ఒక్కసారి కూడా ఈ టోర్నమెంటును గెలుచుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత జట్టుకు తమ సొంత గడ్డపై ఈ నిరీక్షణకు ముగింపు పలకడానికి ఇది ఒక పెద్ద అవకాశం. కానీ భారత జట్టుకు ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికా




చివరిసారిగా 2005లో ఓడించింది. దీని తర్వాత ప్రతిసారి ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. రెండు జట్ల మధ్య ప్రపంచ కప్‌లో ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు జరిగాయి. వాటిలో రెండు జట్లు మూడుసార్లు గెలుపొందాయి. కానీ 2005లో భారత్ చివరి విజయం తర్వాత సౌతాఫ్రికా వరుసగా 3 మ్యాచ్‌లలో గెలిచింది. వీటిలో ఈ టోర్నమెంట్ లీగ్ దశ మ్యాచ్ కూడా ఉంది. అంటే గత మూడు ప్రపంచ కప్ మ్యాచ్‌లలో సౌతాఫ్రికా ఆధిపత్యం సాధించింది. లీగ్ దశలో సౌతాఫ్రికా భారత్‌ను ప్రతి విభాగంలోనూ అధిగమించి సులభంగా విజయం సాధించింది. ఇప్పుడు ఫైనల్‌లో అదే జట్టు మళ్ళీ ఎదురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత జట్టు ఛాంపియన్ కావాలంటే 20 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ పరంపరను ఎలాగైనా బద్దలు కొట్టాలి. భారత మహిళల జట్టు తమ క్రికెట్ చరిత్రలో మూడోసారి మహిళల ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గత రెండుసార్లు ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. 2005 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. అదేవిధంగా 2017 ప్రపంచ కప్‌లో అది ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిపోయింది. కానీ ఈసారి అది ఎటువంటి ఛాన్స్ వదలిపెట్టలేదు.




## బెల్లెరివ్ ఓవల్ భయానక రికార్డు..

### సిరీస్ ఆశలు నిలవాలంటే టీమిండియా అలా చేయాల్సిందే

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మూడో మ్యాచ్ ఆదివారం నాడు హోబర్ట్‌లోని బెల్లెరివ్ ఓవల్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియాను ఓడించి టీమిండియా సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి., ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మూడో మ్యాచ్ ఆదివారం నాడు హోబర్ట్‌లోని బెల్లెరివ్ ఓవల్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియాను ఓడించి టీమిండియా సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. అయితే ఈ మైదానం రికార్డులు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సేనను కలవరపెడుతున్నాయి. ఎందుకంటే ఈ స్టేడియంలో టీ20 చరిత్రలో ఆస్ట్రేలియాకు అపజయం అంటూ లేదు. ఈ భయానక రికార్డును బద్దలు కొట్టి, భారత్ ఎలా విజయం సాధిస్తుందో చూడాలి.ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మూడో మ్యాచ్ ఆదివారం నాడు బెల్లెరివ్ ఓవల్, హోబర్ట్‌లో జరగనుంది. ఈ మ్యాచ్ గెలవడం భారత జట్టుకు అత్యంత కీలకం. సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడిపోతే, సిరీస్ గెలిచే అవకాశాలు పూర్తిగా దూరమవుతాయి. గత టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత్ ఆడిన ఐదు టీ20 సిరీస్‌లలోనూ విజయం సాధించింది. ఆ విజయాల పరంపరను కొనసాగించాలంటే హోబర్ట్‌లో విజయం సాధించడం తప్పనిసరి.బెల్లెరివ్ ఓవల్ స్టేడియం చరిత్ర టీమిండియాకు ఆందోళన కలిగించే అంశం. ఈ మైదానంలో ఆస్ట్రేలియా టీ20లలో అద్భుతమైన రికార్డును కలిగి ఉంది. ఆస్ట్రేలియా ఈ మైదానంలో ఇప్పటివరకు 5 టీ20 మ్యాచ్‌లు ఆడగా, వాటన్నింటిలోనూ విజయం సాధించింది. ఇక్కడ ఆ జట్టుకు ఇప్పటివరకు ఓటమే లేదు. భారత క్రికెట్ జట్టు మొదటిసారిగా ఈ మైదానంలో టీ20 మ్యాచ్ ఆడబోతోంది. 2024 నవంబర్ 18న ఇక్కడ జరిగిన చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది.రెండో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్ల ప్రదర్శన నిరాశపరిచింది. సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ వంటి కీలక ఆటగాళ్లు తక్కువ స్కోరుకే అవుటయ్యారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మరోసారి విఫలమవగా శుభ్‌మన్ గిల్ కేవలం 5 పరుగులే చేశాడు.

## టాప్ ఆర్డర్ ఫెయిల్యూర్..

### సంజు శాంసన్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పులపై సీనియర్ ప్లేయర్ వార్నింగ్

ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా బ్యాటింగ్ పతనం, జట్టు వ్యూహాలపై, బ్యాటింగ్ ఆర్డర్‌పై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ మ్యాచ్‌లో కేవలం ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. జట్టు కేవలం 125 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ నేపథ్యంలో భారత మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ టీమిండియా వ్యూహాత్మక విధానంలోని లోపాలను సూచించారు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా బ్యాటింగ్ పతనం, జట్టు వ్యూహాలపై, బ్యాటింగ్ ఆర్డర్‌పై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ మ్యాచ్‌లో కేవలం ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. జట్టు కేవలం 125 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ నేపథ్యంలో భారత మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ టీమిండియా వ్యూహాత్మక విధానంలోని లోపాలను సూచించారు. ముఖ్యంగా, బ్యాటింగ్ ఆర్డర్‌ను పదే పదే మార్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సూర్యకుమార్ యాదవ్‌ను మూడవ స్థానంలో పర్మనెంట్ బ్యాట్స్‌మన్‌గా ఉంచాలని పఠాన్ సూచించారు. అలాగే సంజు శాంసన్‌ను స్థానం మార్చి ఆడించడం వల్ల కలిగే నష్టాల పై ఇర్ఫాన్ వివరణ ఇచ్చారు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో భారత్ ఘోరంగా ఓడిపోవడానికి బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన ప్రయోగాలే ప్రధాన కారణమని మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషించారు. టీమిండియా కేవలం 125 పరుగులకే ఆలౌట్ కాగా అభిషేక్ శర్మ, హర్షిత్ రాణా మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. సంజు శాంసన్‌ను మూడో స్థానంలో పంపించినా, ఆయన కేవలం 2 పరుగులకే అవుట్ కావడంపై విమర్శలు వచ్చాయి. ఈ వైఫల్యంపై స్పందించిన ఇర్ఫాన్ పఠాన్, సూర్యకుమార్ యాదవ్‌ను టీమిండియాకు పర్మనెంట్ నంబర్ 3 బ్యాట్స్‌మన్‌గా ఉంచాలని సూచించారు. పఠాన్





ప్రకారం.. టీ20 క్రికెట్‌లో ఫ్లెక్సిబిలిటీ ముఖ్యమే అయినప్పటికీ అది ఒక లిమిట్ వరకు మాత్రమే ఉండాలి. “టీ20 క్రికెట్‌లో ఓపెనర్లు కాకుండా మిగతా ఎవరికీ స్థానం స్థిరంగా ఉండదు. ఫ్లెక్సిబిలిటీ అవసరం అనేది నిజమే. కానీ ఫ్లెక్సిబిలిటీ పేరుతో మీరు స్టెబిలిటీని కోల్పోయేంతగా ఎలాస్టిక్ లా సాగదీయకూడదు. జట్టు డిఫైండ్ రోల్స్ కలిగి ఉండాలి” అని పఠాన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో హెచ్చరించారు. ఇలా లేకపోవడం వల్లనే రెండో టీ20 మ్యాచ్‌లో జట్టు బ్యాటింగ్‌లో పెద్ద నష్టాన్ని చవి చూసిందని ఆయన స్పష్టం చేశారు. సంజు శాంసన్, శివమ్ దూబే వంటి ఆటగాళ్లను తరచూ బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్చడం వల్ల కలిగే నష్టాలను పఠాన్ వివరించారు. ఆసియా కప్‌లో శాంసన్ మిడిల్ ఓవర్లలో పాత బాల్‌తో ఆడాడు. అదే ఆటగాడు ఓపెనింగ్‌లో ఆడటం పూర్తిగా భిన్నం. ఇలా పదే పదే పాత్ర మార్చడం వల్ల బ్యాటర్ మైండ్‌సెట్ పూర్తిగా మారిపోతుందని, ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని పఠాన్ అభిప్రాయపడ్డారు. కేవలం 2 బంతులు ఆడి అవుటైన శివమ్ దూబే విషయంలోనూ అదే జరిగింది. రాణా తర్వాత దాదాపు లోయర్ ఆర్డర్‌లో దూబేను పంపించడం సరైన నిర్ణయం కాదని ఆయన అన్నారు. పఠాన్ తన విశ్లేషణను ముగించేటప్పుడు సంజు శాంసన్‌కు ఒక మెసేజ్ ఇచ్చారు. “సపోర్ట్ అవసరం లేదనేది లేదు, అతనికి కచ్చితంగా సపోర్ట్ లభిస్తోంది. కానీ ఒక ఆటగాడు వరుసగా మూడు లేదా నాలుగు మ్యాచ్‌లలో విఫలమైతే ఆ సపోర్ట్ కూడా త్వరగా తగ్గిపోతుంది. సంజు శాంసన్ ఈ సిరీస్‌లో మంచి ఇన్నింగ్స్‌తో రాణించాలని ఆశిస్తున్నాను” అని పఠాన్ సూచించారు. ఏదేమైనా మంచి ప్రదర్శన లేకపోతే, జట్టులో స్థానం నిలబెట్టుకోవడం కష్టం అవుతుందని ఆయన హెచ్చరించారు.

# కారు టైర్ల స్పీడ్ లిమిట్ మీకు తెలుసా?

## ఇవి తెలుసుకోకపోతే ఇన్సూరెన్స్ రాదు!



కార్ టైర్ల స్పీడ్ లిమిట్‌ను తెలుసుకోవడం చాలా ముఖ్యం. తప్పు టైర్లను వాడితే ప్రమాదాలు మాత్రమే కాకుండా, ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు తిరస్కరించబడతాయి. టైర్ కోడ్‌లోని చివరి ఆల్ఫాబెటిక్ లెటర్ స్పీడ్ రేటింగ్‌ను సూచిస్తుంది. టైర్లను మార్చేటప్పుడు సరైన స్పీడ్ లిమిట్ ఉన్న టైర్లను ఎంచుకుని, ఇన్సూరెన్స్ రక్షణను నిర్ధారించుకోండి. కార్ టైర్ల స్పీడ్ లిమిట్‌ను తెలుసుకోవడం చాలా ముఖ్యం. తప్పు టైర్లను వాడితే ప్రమాదాలు మాత్రమే కాకుండా, ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు తిరస్కరించబడతాయి. టైర్ కోడ్‌లోని చివరి ఆల్ఫాబెటిక్ లెటర్ స్పీడ్ రేటింగ్‌ను సూచిస్తుంది. టైర్లను మార్చేటప్పుడు సరైన స్పీడ్ లిమిట్ ఉన్న టైర్లను ఎంచుకుని, ఇన్సూరెన్స్ రక్షణను నిర్ధారించుకోండి. కారు కొనుగోలు చేసేటప్పుడు ఇంజన్, డిజైన్, ఫీచర్‌లపై దృష్టి పెడతాము. కానీ టైర్ల గురించి పెద్దగా ఆలోచించము. కానీ టైర్లకు కూడా స్పీడ్ లిమిట్స్ ఉంటాయని చాలామందికి తెలియదు. ప్రతి టైర్‌పై ఒక కోడ్ ఉంటుంది. అందులోని చివరి ఆల్ఫాబెటిక్ లెటర్ టైర్ స్పీడ్ రేటింగ్‌ను సూచిస్తుంది. ఉదాహరణకు, ఎల్ అంటే గంటకు 120 కిలోమీటర్లు. ఈ స్పీడ్ లిమిట్‌ను మించితే ప్రమాదాలకు దారితీస్తుంది. టైర్లను మార్చేటప్పుడు మెకానిక్స్ సలహాను గుడ్డిగా నమ్మకుండా మీ వాహనానికి సరిపోయే స్పీడ్ లిమిట్ ఉన్న టైర్‌ను ఎంచుకోవడం అవసరం. సరైన టైర్ల వాడకం వల్ల భద్రత, టైర్ల దీర్ఘకాల మన్నిక ఉంటాయి. అంతేకాకుండా తయారీదారు సిఫార్సు చేసిన స్పీడ్ రేటింగ్‌కు భిన్నమైన టైర్లను వాడితే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు తిరస్కరించబడతాయి. అందువల్ల సరైన టైర్ స్పీడ్ రేటింగ్‌ను ఎంచుకోవడం మీ భద్రతకు, ఇన్సూరెన్స్ కవరేజీకి అత్యవసరం. కారు కొనుగోలు చేసేటప్పుడు ఇంజన్ సామర్థ్యం, డిజైన్ సౌందర్యం, అత్యాధునిక ఫీచర్ల గురించి విస్తృతంగా పరిశీలిస్తుంటాము. అయితే, కారుకు అత్యంత కీలకమైన భాగాలలో ఒకటైన టైర్ల గురించి మాత్రం మనం పెద్దగా శ్రద్ధ చూపము. కానీ టైర్లకు కూడా నిర్దిష్ట స్పీడ్ లిమిట్స్ ఉంటాయని, ఈ విషయం తెలియకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని చాలామందికి అవగాహన ఉండదు. ప్రతి టైర్‌కు ఒక ప్రత్యేకమైన కోడ్ ఉంటుంది. ఈ కోడ్‌లోని చివరి ఆల్ఫాబెటిక్ లెటర్ ఆ టైర్ గరిష్ట స్పీడ్ రేటింగ్‌ను సూచిస్తుంది. ఉదాహరణకు ఒక టైర్‌పై ఎల్ అనే అక్షరం ఉంటే, ఆ టైర్ గంటకు 120 కిలోమీటర్ల వేగాన్ని తట్టుకోగలదని అర్థం. అలాగే, డబ్ల్యూ వంటి ఇతర అక్షరాలకు కూడా నిర్దిష్టమైన స్పీడ్ పరిమితులు ఉంటాయి. ఈ స్పీడ్ లిమిట్‌ను మించి వేగంగా ప్రయాణిస్తే టైర్లకు తీవ్ర నష్టం వాటిల్లి, అకస్మాత్తుగా టైర్ పగిలి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. అందుకే ఈ సమాచారాన్ని తెలుసుకోవడం వాహనదారులకు అత్యంత ముఖ్యం. చాలాసార్లు టైర్లు మార్చేటప్పుడు, మెకానిక్‌లు సూచించిన టైర్లను మనం గుడ్డిగా అమర్చుకుంటాము. అయితే, టైర్ రీప్లేస్‌మెంట్ సమయంలో, మెకానిక్ సూచించిన టైర్ మీ వాహనానికి నిజంగా సరిపోతుందా లేదా అని కోడ్ ద్వారా క్రాస్-చెక్ చేసుకోవడం తప్పనిసరి. ఆ టైర్ స్పీడ్ లిమిట్ ఎంత? అది మీ వాహన అవసరాలకు అనుగుణంగా ఉం దా అని నిర్ధారించుకోవాలి. ఈ కోణంలో పరిశీలిస్తే మీ వాహనానికి ఏ స్పీడ్ లిమిట్ ఉన్న టైర్ సరిపోతుందో మీకు స్పష్టంగా అర్థమవుతుంది.సరైన స్పీడ్ లిమిట్ ఉన్న టైర్లను ఉపయోగించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ముందుగా ఇది మీ ప్రయాణ భద్రతను గణనీయంగా పెంచుతుంది. రెండవది, టైర్లు మంచి కండిషన్‌లో ఉండి. ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. మూడవది అత్యంత ముఖ్యమైనది. తయారీదారు డిజైన్ చేసినప్పుడు నిర్ణయించిన స్పీడ్ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా లేని టైర్లను మీరు ఉపయోగిస్తే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ క్లెయిమ్ తిరస్కరించబడుతుంది. ఇన్సూరెన్స్ ఇలాంటి క్లెయిమ్‌లను ఆమోదించవు. అందువల్ల మీ వాహనానికి సరిపోయే సరైన స్పీడ్ మాత్రమే ఉపయోగించడం మీ భద్రతకు, ఆర్థిక రక్షణకు అత్యవసరం. ఈ విషయాలను విస్మరిస్తే ఇన్సూరెన్స్ ప్రయోజనాలు పొందలేరని గుర్తుంచుకోవాలి.

# బిజినెస్

## వామ్మో.. ఒక్క మెస్సేజ్‌తో ఐటీ నోటీసులు




ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తికి వాట్సాప్ చాట్ ఆధారంగా నోటీసులు రావడం చర్చనీయాంశంగా మారింది. ఓ వ్యక్తి మొబైల్‌లో లభించిన చాట్ ఆధారంగా అధికారులు రూ.22కోట్లు పెట్టుబడులకు సంబంధించిన ఈ నోటీసులు పంపించారు. దీంతో సదరు వ్యక్తి అవాక్కయ్యాడు. తాను ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదని తెలిపారు. చివరకు ట్రిబ్యునల్ ఏం తీర్పు ఇచ్చిందంటే..? ఒక సాధారణ వాట్సాప్ చాట్‌ను ఆధారం చేసుకొని.. ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తికి ఐటీ నోటీసులు వచ్చాయి. ఏకంగా రూ.22 కోట్ల విలువైన వెల్లడించని పెట్టుబడులు పెట్టారని ఆరోపిస్తూ ఐటీ శాఖ నోటీసు పంపడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే సరైన ఆధారాలు లేనందున ఈ మొత్తాన్ని కొట్టివేస్తూ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ సంచలన నిర్ణయం తీసుకుంది. వాట్సాప్ ఆధారంగా..ఐటీ అధికారులు ఒక రియల్ ఎస్టేట్ కంపెనీపై దాడులు నిర్వహించినప్పుడు.. డాక్యుమెంట్స్‌తో పాటు అక్కడున్న వ్యక్తి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్ నుంచి కొన్ని కీలకమైన వాట్సాప్ మెస్సేజులు, ఎన్వలప్‌లు అధికారులకు లభ్యమయ్యాయి. ఈ చాట్‌లలో పెట్టుబడి, వడ్డీ వివరాలు ఉన్నాయని, ఒక ఎన్వలప్‌పై ఢిల్లీకి చెందిన ఆ వ్యక్తి పేరు కూడా ఉందని ఐటీ శాఖ తెలిపింది. దీని ఆధారంగా ఆ వ్యక్తి ఒక ప్రైవేట్ కంపెనీతో హామీ ఇచ్చిన రిటర్న్ స్కీమ్‌లో రూ.22 కోట్లు నగదు పెట్టుబడి పెట్టారని అధికారులు నిర్ధారించారు.

-ఈ క్రమంలో ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్లు 153%జ%, 69 కింద చర్యలు చేపట్టారు. పన్ను, వడ్డీని డిమాండ్ చేస్తూ అతనికి నోటీసులు ఇచ్చారు. నోటీసు అందుకున్న వ్యక్తి ఐటీ శాఖ ఆరోపణలను ఖండించారు. తాను ఎటువంటి పెట్టుబడులు పెట్టలేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వాట్సాప్ తన ఫోన్ నుండి కాకుండా ఇతరుల నుంచి వచ్చిన డేటా కాబట్టి ఖచ్చితమైన రుజువు లేకుండా వాటిని సాక్ష్యంగా పరిగణించలేమని ఆయన వాదించారు. తన పేరును తప్పుగా ఆపాదించారని తెలిపారు.కేసు కొట్టేసిన ట్రిబ్యునల్ ఈ కేసుపై ఢిల్లీ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ సమగ్ర దర్యాప్తు నిర్వహించింది. ఐటీ శాఖ సమర్పించిన డిజిటల్ డేటాలో ఎటువంటి ఖచ్చితమైన ఆధారాలు లేదా సంతకాలు లేవు. పేర్కొన్న ఎన్వలప్‌లలో వ్యక్తి పేరు స్పష్టంగా లేదు. లావాదేవీలు నిజంగా జరిగాయని నిరూపించడానికి ఎటువంటి పత్రాలు లేదా ఒప్పందాలు లేవు. వీటిని పరిగణలోకి తీసుకున్న ట్రిబ్యునల్.. కేసును కొట్టేసింది. వాట్సాప్ చాట్‌ల వంటి ఎలక్ట్రానిక్ డేటాను వ్యక్తి ధృవీకరించడం లేదా ఇతర డాక్యుమెంట్లు ఉంటేనే సాక్ష్యంగా పరిగణించడానికి అవకాశం ఉంటుందని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఈ తీర్పు డిజిటల్ డేటా వినియోగం, పన్ను చట్టాల అమలు, పౌరుల ప్రైవసీ విషయంలో ఒక మైలురాయిగా నిలిచింది.

# ఆరోగ్యం- మహాభాగ్యం



### అంజీర్ లడ్డు తయారీకి కావలసిన పదార్థాలు

- ఎండిన అంజూర పండ్లు - 1 కప్పు (10 నుండి 15 ముక్కలు)
- తరిగిన ఖర్జూరాలు - 1 కప్పు
- తరిగిన బాదం- కప్పు
- జీడిపప్పు- కప్పు
- పిస్తాపప్పులు - 2 టేబుల్ స్పూన్లు
- వాల్‌నట్స్ - 2 టేబుల్ స్పూన్లు
- నెయ్యి - 1 టేబుల్ స్పూన్
- ఏలకుల పొడి- టీస్పూన్

## ఈ చిన్న లడ్డూతో కొండంత ఆరోగ్యం..!

### శీతాకాలంలో రోజూ ఒక్కటి తిన్నారంటే తిరుగుండదు..

అంజీర మన ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తున్న విషయం తెలిసిందే.. అయితే వీటిని లడ్డూల తయారు చేసుకొని తినడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలో ఈ లడ్డు తినడం వల్ల శరీరం లోపలి నుండి వెచ్చగా ఉంటుంది. కాబట్టి ఇన్ని ప్రయోజనాలు ఉన్న అంజీరా లడ్డును ఎలా తయారు చేసుకోవాలి.. వాటి ప్రయోజనాలు ఏంటో చూద్దాం పదండి. శీతాకాలంలో అంజీర్ లడ్డూ మనకు ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలు చేస్తుంది. ఇది మన శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచేందుకు సహాయపడుతుంది. అలాగే రక్తహీనత , జీర్ణక్రియ , మలబద్ధకం , పేగు ఆరోగ్యం , కండరాల ఆరోగ్యం , బరువు నియంత్రణ , చర్మం, జుట్టు ఆరోగ్యానికి చికిత్స చేయడంలో సహాయపడుతుంది. ఈ లడ్డును పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఇష్టపడతారు . శీతాకాలంలో ఈ లడ్డూను రోజుకూ ఒకటి తినడం వల్ల ఇది మనల్ని అనేక వ్యాధుల భారీ నుంచి రక్షిస్తుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

#### అంజీర్ లడ్డు ఎలా తయారు చేయాలి

అంజీరా లడ్డూ తయారు చేసేకునేందుకు ముందుగా అంజీర్, ఖర్జూరాలను చిన్న ముక్కలుగా కట్‌చేయండి. ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి వేడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్ వేసి కాసేపు వేయించాలి.తరువాత అదే పాన్ లో ముందుగా కట్‌చేసుకున్న అంజీర్ పండ్లు, ఖర్జూర ముక్కలు వేసి 4 నుండి 5 నిమిషాలు అవి మెత్తబడే వరకు ఉడికించాలి. తరువాత తరిగిన డ్రై ఫ్రూట్స్, ఏలకుల పొడి వేసి బాగా కలపాలి.ఇప్పుడు స్టవ్ ఆఫ్ చేసి, మిశ్రమాన్ని కొద్దిగా చల్లారనివ్వండి, తర్వాత మీ చేతులకు నెయ్యి రాసుకుని చిన్న చిన్న లడ్డూల తయారు చేసుకోండి. మీకు ఇష్టమైతే, ఈ లడ్డులకు కాల్చిన నువ్వులు లేదా గసగసాలు జోడించవచ్చు. ఎండిన అంజీర్, ఖర్జూరంతో తయారుచేసిన ఈ రుచికరమైన వంటకానికి చక్కెర లేదా బెల్లం అవసరం లేదు. బాదం, జీడిపప్పు, పిస్తాపప్పు, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు అంజీర్, ఖర్జూరం నిజమైన తీపి వీటికి రుచిని తెచ్చిపెడుతుంది. ఈ లడ్డులు మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా.. మీకు తక్షన శక్తిని అందిస్తాయి.

## అందమైన గులాబీలతో అద్భుతమైన ఆరోగ్యం..

### లాభాలు తెలిస్తే అవాక్కే..

అందమైన మెరిసే చర్మం కోసం చాలా మంది గులాబీ రేకులను ఉపయోగిస్తారు. కొందరు గులాబీ రేకులను తింటారు. మరికొందరు ఫేస్ ప్యాక్, హెయిర్ మాస్క్‌గా కూడా ఉపయోగిస్తారు. కానీ, అందమైన గులాబీ రేకులు చర్మ, కేశ సౌందర్యానికి మాత్రమే కాదు..ఆరోగ్యానికి ఎలాంటి లాభాలు అందిస్తుందో తెలిస్తే అస్సలు నమ్మలేరు. గులాబీ రేకులు తినటం వల్ల శరీరం నుండి మలినాలను క్లియర్ చేస్తుంది. అంతేకాదు..జీవక్రియను మెరుగుపరుస్తుంది. మరిన్ని లాభాలేంటో ఇక్కడ చూద్దాం..

ఈ గులాబీలు బరువు తగ్గడంలో సహాయపడతాయి. రోజు కొన్ని తాజా గులాబీ రేకులను తినడం వల్ల ఇంద్రియాలను సంతృప్తిపరుస్తాయి. ఫలితంగా సహజమైన మార్గంలో బరువు తగ్గడానికి సహాయపడుతుంది. గులాబీ పూలు కేవలం అందానికి, అలంకరణకు మాత్రమే కాదు.. పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాల నిధి. గులాబీ పూ రేకులలో ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలు ఉంటాయి. గులాబీ రేకుల సువాసన ఒత్తిడిని తగ్గిస్తుంది. గులాబీ రేకులతో తయారు చేసిన డ్రింక్‌ను తీసుకోవడం వల్ల తలనొప్పి, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలు దూరం అవుతాయి. గులాబీ రేకుల్లో విటమిన్ ఎ, సి, ఇ, ఐరన్, కాల్షియం విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. గులాబీ రేకులలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. గులాబీ రేకులను రోజు వారిగా నిర్ణీత మోతాదులో తీసుకుంటే ఆకలి తగ్గుతుంది. దీంతో అతిగా తినకుండా ఉంటారు. ఫలితంగా బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. గులాబీ రేకుల్లోని గుణాలు శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తుంది. ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండటం వల్ల త్వరగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పైల్స్ సమస్యతో బాధపడుతున్న వారు గులాబీ రేకులను తీసుకోవటం వల్ల సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఉండే పీచు పదార్థం జీర్ణశక్తిని పెంచేందుకు తోడ్పడుతుంది. గులాబీ రేకులు, బాదంపప్పు కలిపి రోజూ ఉదయాన్నే తీసుకుంటే రక్తపోటు తగ్గిపోతుంది. గులాబీ రేకులతో తయారు చేసిన కషాయం తీసుకోవటం వల్ల శరీరంలో చెడు కొలస్ట్రాల్ పోతుంది. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గులాబీ పువ్వులలో ఉండే యాంటీ-ఆక్సిడెంట్ ఎలిమెంట్ చర్మంలోని దెబ్బతిన్న కణాలను రిపేర్ చేయడంతో పాటు స్కిన్ ఇన్ఫెక్షన్లు దరిచేరకుండా కాపాడుతుంది. కొబ్బరి నూనెలో గులాబీ రేకులను కలిపి వేడి చేసి, చల్లరిన తరువాత తలకు రాసుకోవటం వల్ల మెదడు చల్లబడి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. చీముపట్టి బాధపెట్టే పుళ్ళ మీద గులాబీ పొడి చల్లితే యాంటీబయాటిక్ లా పనిచేస్తుంది. శరీరంలోని సెల్యులార్ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.



# పెద్ది జాన్వీ లుక్..

## పక్కా మాస్ క్యారెక్టర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు హై లెవెల్ లో ఉన్నాయి. ఇప్పటికే చరణ్ మేకోవర్, సినిమా బ్యాక్‌డ్రాప్ గురించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు, ఆ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తూ, మేకర్స్ ఈ సినిమా నుంచి హీరోయిన్ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తో జాన్వీ తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసేలా కనిపిస్తోంది. జాన్వీ కపూర్ అనగానే మనకు గుర్తొచ్చేది బాలీవుడ్ గ్లామర్, ఫ్యాషన్ ఐకాన్. కానీ 'పెద్ది' కోసం ఆమె చేసిన మేకోవర్ చూసి అందరూ షాక్ అవుతున్నారు. ఇది సింపుల్ డీ గ్లామ్ రోల్ కాదు, పక్కా మాస్ క్యారెక్టర్. శ్రీదేవి కూతురిగా 'అతిలోక సుందరి' ఇమేజ్ ఉన్న జాన్వీ, ఇప్పుడు 'అచ్చియమ్మ'గా పూర్తి మాస్ అవతార్‌లో కనిపించబోతోంది. ఇది ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్. ఇక నేడు రిలీజ్ చేసిన పోస్టర్ లో, ముఖ్యంగా ఓపెన్ టాప్ జీపుపై నిలబడి, జనం మధ్యలో అభివాదం చేస్తున్న లుక్ అదిరిపోయింది. ఆ కట్టుబొట్టు, ఆ సన్ గ్లాసెస్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే, ఇది కేవలం హీరో పక్కన పాటలు పాడుకునే హీరోయిన్ పాత్ర కాదని, కథలో చాలా పవర్ ఉన్న రోల్ అని అర్థమవుతోంది. అందుకే మేకర్స్ ఆమె క్యారెక్టర్‌ను "ఫియర్స్ అండ్ ఫియర్‌లెస్" అని పిలుస్తున్నారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా తన గురువు సుకుమార్ స్టైల్‌లోనే, హీరోయిన్ పాత్రలను చాలా బలంగా డిజైన్ చేసినట్లున్నాడు. 'ఉప్పెన'లో 'బేబమ్మ' పాత్రకు ఎంత ఇంపార్టెన్స్ ఇచ్చాడో, ఇప్పుడు 'అచ్చియమ్మ' పాత్రను కూడా అంతే పవర్‌ఫుల్‌గా మలిచాడని ఈ లుక్ ప్రూవ్ చేస్తోంది. ఇది కేవలం లవ్ స్టోరీ కాదు, ఒక పల్లెటూరి సోషల్ డ్రామాలా కనిపిస్తోంది. బాలీవుడ్‌లో పీక్ స్టేజ్‌లో ఉన్న ఒక స్టార్ హీరోయిన్, సౌత్ సినిమాలో, అది కూడా పాన్ ఇండియా లెవల్‌లో ఇంత పూర్తిస్థాయి మాస్ రోల్ చేయడం పెద్ద ఛాలెంజ్. ఒకవేళ 'అచ్చియమ్మ' పాత్ర 'రంగస్థలం'లోని 'రామలక్ష్మి'లా పేలితే, జాన్వీ రేంజ్ ఇండియా వైడ్‌గా మారిపోతుంది. ఆమె కేవలం గ్లామర్ డాల్ కాదని, పెర్ఫార్మెన్స్‌తోనూ మెప్పించగలదని ప్రూవ్ చేసుకున్నట్లే. ఈ భారీ బడ్జెట్ సినిమాను వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతంఅ అందిస్తున్న ఈ సినిమాకు రత్నవేలు లాంటి టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. 2026 మార్చి 27న రానున్న ఈ సినిమాలో, చరణ్ మేకోవర్‌తో పాటు, 'అచ్చియమ్మ'గా జాన్వీ మాస్ పెర్ఫార్మెన్స్ కూడా నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండనున్నట్లు అర్థమవుతుంది.

# ఆ దుర్ఘటనకు విజయ్ ఒక్కడే బాధ్యుడే కాదు





ప్రముఖ కోలీవుడ్ హీరో, కొత్త రాజకీయ నాయకుడు విజయ్ తన పొలిటికల్ పార్టీ తమిళగ వెట్రి కళగం బహిరంగ సభ నిర్వహిస్తున్నప్పుడు కరూర్ వద్ద తొక్కిసలాట జరిగి అందులో పలువురు అభిమానులు, జనాలు ప్రాణాలను కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనపై ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు రియాక్ట్ అయ్యారు. అయితే రియాక్ట్ అయిన వాళ్లంతా ఆల్మోస్ట్ రాజకీయ పరంగా కాస్తో కూస్తో టచ్ ఉన్న వాళ్లే. రాజకీయాలకు టచ్ లేని వాళ్లు, సినీ ఇండస్ట్రీ నుంచి ఎవరూ దీనిపై రెస్పాండ్ కాలేదు. ఇప్పుడు ప్రముఖ కోలీవుడ్ హీరో అజిత్ కుమార్ ఈ తొక్కిసలాట విషయంపై మాట్లాడారు. ఇలాంటి సిట్యుయేషన్స్ కు కారణాలు, ఎవరు ఎలా ప్రవర్తించాలనే వాటిపై ఆయన నోరు విప్పారు. కరూర్ తొక్కిసలాట విషయంలో ఎవరినీ తక్కువ చేయడం తన ఉద్దేశం కాదని, కానీ ఇలాంటి సంఘటనలు రీసెంట్ టైమ్స్ లో ఎక్కువయ్యాయని ఆయన అన్నారు.దీనికి విజయ్ తో పాటూ ప్రతీ ఒక్కరూ బాధ్యులేనని, ఇలాంటి వాటిపై జనాలకు ఎక్కువగా అవగాహన కల్పించాలని, సినీ సెలబ్రిటీల సభల్లోనే ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి విషాదాల వల్ల ఇండస్ట్రీకి చెడ్డ పేరొస్తుందని అజిత్ రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సెలబ్రిటీల కోసం జనాలు ఎగబడతారనేది అందరికీ తెలిసిన విషయమేనని, అందుకే తాను తన పిల్లల్ని డ్రాప్ చేయడానికి కూడా ఎప్పుడూ స్కూల్ దగ్గరకు వెళ్లనని ఆయన చెప్పారు. ఇక తన కెరీర్ గురించి మాట్లాడుతూ, తాను ప్రతీ సినిమానీ మొదటి సినిమాలాగానే ఫీలవుతానని, తాను సక్సెస్‌ను పెద్దగా పట్టించుకోనని, ఫస్ట్ మూవీ కోసం తనను మేకర్స్ 100 రోజుల కాల్షీట్స్ అడిగారని, అప్పట్నుంచి తాను డేట్స్ ఇస్తూనే ఉన్నానని, తనను ఇంతగా సపోర్ట్ చేస్తున్నందుకు ఫ్యాన్స్ కు ఎప్పటికీ రుణపడి ఉంటానని అజిత్ అన్నారు.గతంలో తమిళనాడు ఎలక్షన్స్ లో తనపై వచ్చిన ఓ వార్త విషయంలో కూడా ఆయన క్లారిటీ ఇచ్చారు. తాను, తన భార్యతో కలిసి ఓటు వేయడానికి పోలింగ్ బూత్ కు వెళ్లానని, అక్కడికి వచ్చిన సెలబ్రిటీలందరినీ ఓ వ్యక్తి ఫోటోలు తీస్తున్నాడని, అక్కడ ఫోన్ లు వాడకూడదని బోర్డులు పెట్టినప్పటికీ, అక్కడి స్టాఫ్ ఎంత చెప్పున్నా వినకపోవడంతో, తానే ఆ ఫోన్ లాక్కొని అక్కడి స్టాఫ్ కు ఇచ్చానని, దాన్ని అందరూ తాను ఓ అభిమానిపై ఫైర్ అయ్యానని నెగిటివ్ గా రాశారని ఆ వార్తలు చూసి షాకయ్యానని అజిత్ క్లారిటీ ఇచ్చారు.

# రాజమౌళి సినిమాతో మహేష్‌కి భారీ లాస్..?



అయితే ఈ సినిమా కోసం మహేష్ రెమ్యునరేషన్ గా మహా అంటే ఒక 100 కోట్లకు అటు ఇటుగా తీసుకునే ఛాన్స్ ఉంటుంది. సూపర్ స్టార్ మహేష్ దర్శకధీరుడు రాజమౌళి ఇద్దరు కలిసి చేసే సినిమాపై నేషనల్ లెవెల్ లో అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే ఈ సినిమా కోసం మహేష్ దాదాపు 3 ఏళ్ల దాకా డేట్స్ ఇచ్చేశాడని తెలుస్తుంది. రాజమౌళి సినిమా అంటే మినిమం రెండు మూడేళ్లు లేనిది సినిమా పూర్తి కాదు. మహేష్ తో చేస్తున్న సినిమా రెండు భాగాలని వినిపిస్తుంది. సో ఎలా లేదన్నా ఒక 3 నుంచి నాలుగేళ్ల దాకా మహేష్ ఈ సినిమా కోసం టైం కేటాయించాల్సిందే అని చెప్పొచ్చు. అయితే ఈ సినిమా కోసం మహేష్ రెమ్యునరేషన్ గా మహా అంటే ఒక 100 కోట్లకు అటు ఇటుగా తీసుకునే ఛాన్స్ ఉంటుంది. ముంబై కోకిలాబెన్ ఆసుపత్రిలో అమితాబ్ సినిమా బడ్జెట్ 300 కోట్ల దాకా ఉంటే మహేష్ కి ఒక 100 రాజమౌళికి ఒక 50 నుంచి 80 కోట్ల దాకా రెమ్యునరేషన్ తీసుకుంటారని తెలుస్తుంది. అయితే మహేష్ బాబు 4 ఏళ్లు డేట్స్ ఇచ్చి కేవలం 100 కోట్లు తీసుకోవడం అంటే అది ఆయనకు భారీ లాస్ అనే చెప్పొచ్చు. ఎందుకంటే మహేష్ ప్రతి సినిమాకు ప్రస్తుతం 50 కోట్ల దాకా రెమ్యునరేషన్ తీసుకుంటున్నాడు. నాలుగేళ్లలో నాలుగు సినిమాలు కనీసం 3 సినిమాలు చేసినా 150 నుంచి 200 కోట్ల దాకా వర్క్ అవుట్ అవుతుంది. అవే కాకుండా ప్రతి ఏడాది మహేష్ యాడ్స్ ద్వారా మరో 20 నుంచి 40 కోట్ల దాకా తీసుకుంటాడు. రాజమౌళి సినిమా అంటే మహేష్ ఎలాంటి యాడ్స్ చేసే అవకాశం లేదు. సో నాలుగేళ్లు బయట సినిమా చేస్తే 300 కోట్ల దాకా సంపాదించే మహేష్ 200 కోట్లు లాస్ అయ్యి కేవలం జక్కన్న సినిమాకు 100 కోట్లు మాత్రమే రెమ్యునరేషన్ గా తీసుకుంటున్నాడు. ఇదంతా మహేష్ కాలిక్యులేట్ చేసుకుని ఉంటాడని ఫ్యాన్స్ చర్చిస్తున్నారు. అయితే లాస్ 200 కోట్ల గురించి ఆలోచిస్తే బాహుబలితో ప్రభాస్, ఆర్.ఆర్.ఆర్ తో ఎన్.టి.ఆర్, రాం చరణ్ లకు వచ్చిన గుర్తింపు గురించి ఆలోచించాలి. ట్రిపుల్ ఆర్ సినిమాతో రాజమౌళికి ఇంటర్నేషనల్ లెవెల్ లో బ్రాండ్ క్రియేట్ అయ్యింది. సో మహేష్ తో చేస్తున్న సినిమా ఎలా లేదన్నా కూడా హాలీవుడ్ అప్పీల్ ఉంటుంది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ ఇంటర్నేషనల్ స్టార్ అవుతాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి ఈ రెమ్యునరేషన్ లెక్కలన్నీ పక్కన పెడితే రాజమౌళితో మహేష్ సినిమా 100కి 100 శాతం ప్రాఫిటబుల్ వెంచరే అని చెప్పొచ్చు.






Prajajwala Telugu Daily : Printer, Publisher and Owned by APPIKONDA BHAVANI ,[LATE] A.BHASKAR RAO, Head Office: Vizag, T.S.Branch Office Address: plot no: 204, Road No:7 venus Rocks Heights, Devendra Nagar-Gajularamaram Quthbullapur, Hyderabad- 500055: prajajwalatelangana@gmail.com cell. no. 9700070315, RNI No. APTEL 2010/33400.